పీహెచ్‌సీల భవనాలకు మరమ్మతులు చేయండి

పెద్దఎత్తున నిధులు విడుదల చేయాలి

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి సంబంధించి మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సిపిఎం పార్టీడిమాండ్ చేశారు. జిల్లాలో డిల్లీనుండి విచ్చేసిన ప్రత్యేకఎన్.హెచ్.ఎం. టీము 45రోజుల పాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శన చేయనున్న నేపథ్యంలో వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల వాస్తవాలను సిపిఎం నాయకులు తెలియజేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వైద్య సేవలు అందించాలని, నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసి సమస్యలు తెలియజేస్తామని చెప్పారు. నాయకులు రెడ్డి. వేణు, మండల కార్యదర్శి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు రాయిపల్లి రాము, గవర వెంకటరమణ, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజెఎఫ్ పార్వతీపురం నియోజకవర్గ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-బెలగాం : ఏపీడబ్ల్యూజెఎఫ్ పాత్రికేయ సంఘం ఆవిర్భావం సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డిఎస్‌ఆర్ పట్నాయక్, కెవి నారాయణరావుల (నాగు) ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆ సంఘం పార్వతీపురం నియోజకవర్గం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా టి.శేఖర్‌బాబు, కార్యదర్శిగా పి. నానిబాబు, ఉపాధ్యక్షులుగా జి. పోలినాయుడు, కోశాధికారిగా పిన్నింటి చిన్నారావు సహాయ కార్యదర్శిగా ఎవి రమణలు కార్యవర్గ సభ్యులుగా ఈ. వెంకటరమణ, ఎం. నారాయణ, ఎద్దు చిన్నారావు, బి. కృష్ణ, పి. శంకర్రావు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులు పాత్రికేయుల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు కట్టుబడి ఉంటామని, బాధ్యతగా పనిచేసే సంఘాన్ని ఉన్నతపదంలో నిలుపుతామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు సంస్కృత పాఠశాల విద్యార్థి

విశాలాంధ్ర-బెలగాం : పాఠశాల స్థాయి, మండల స్థాయి, ఉమ్మడి జిల్లా స్థాయిలలో జరిగిన చెస్ పోటీలలో జిల్లా పరిషత్ సంస్కృత ఉన్నత పాఠశాల పార్వతీపురంకు చెందిన వి. ధనంజయరాజు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఉత్తరావల్లి గోవింద నాయుడు మాస్టారు తెలిపారు. ఆ విద్యార్థితో పాటు చెస్ ఆర్బిట్రేటర్ వెంకటేష్ ను అభినందించారు. ఈ నెల 7,8, 9 తేదీలలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని విజేతగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు 350 సచివాలయాల్లో 'కౌశలం' ట్రయల్ రన్ : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కౌశలం' (వర్క్ ఫ్రమ్ హెూమ్) కార్యక్రమం అమలుకు సంబంధించి జిల్లాలోని 350గ్రామ, వార్డు సచివాలయాలలో నేడు గురువారం ట్రయల్ రన్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, ట్రయల్ రన్ ఏర్పాట్లను గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ కె. రామచంద్రరావు పర్యవేక్షిస్తున్నారు. ట్రయల్ రన్ కార్యక్రమాన్ని సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం నిర్వహిస్తారు. ఈపరీక్షలో ఆయా సచివాలయాల ఉద్యోగులు పాల్గొంటారన్నారు. జిల్లాలో 'కౌశలం' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి వీలుగా, ముందుగా సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నాయా, పరిపాలనాపరమైన సవాళ్లు ఏమున్నాయి వంటి అంశాలను ఈ ట్రయల్ రన్ ద్వారా పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. గుర్తించిన అంశాలను తక్షణమే పరిష్కరించి, కౌశలం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా ప్రారంభించడానికి ఈముందస్తు పరీక్ష దోహదపడుతుందన్నారు.

పూర్తిస్థాయిలో రెవిన్యూ సదస్సులు నిర్వహణ : జిల్లా రెవెన్యూ అధికారి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో పూర్తిస్థాయిలో రెవిన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందని, ఎటువంటి పెండింగులేదని జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 6,247 రెవిన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా అవన్నీ పూర్తయినట్లు ఆమె వివరించారు. సీతానగరం మండలంలో 731, పాచిపెంటలో 639, మక్కువలో 591, పార్వతీపురంలో 548, సీతంపేటలో 509, జియ్యమ్మవలసలో 507, భామినిలో 456, బలిజిపేటలో 410, గుమ్మలక్ష్మీపురంలో 381, కొమరాడలో 342, పాలకొండలో 259, కురుపాంలో 246, సాలూరులో 207, వీరఘట్టంలో 191, గరుగుబిల్లిలో 169, సాలూరు అర్బన్ లో 61 కలిపి 6,247 సదస్సులను నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్లకి జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకి గత మూడు నెలలుగా జీతాలు రావడం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ డ్వామా పిడి రామచంద్ర రావుకు బుదవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధి హామీ పథకంలో మిగిలిన అన్ని క్యాడర్ల వారికి జీతాలు సకాలంలో వస్తున్నాయనీ, టెక్నికల్ అసిస్టెంట్లకి జీతాలు సకాలంలో రావడంలేదని వారు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా టెక్నికల్ అసిస్టెంట్లకి జీతాలు సకాలంలో అందకపోవడంతో దానికొరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్నిజిల్లాల పిడిలకు వినతిపత్రాన్ని బుదవారం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్య క్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బి.సోమేశ్వరరావు, సెక్రెటరీ జి రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ వి శంకర్రావు, ట్రెజరర్ పి అరుణ అన్నిమండలాల సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని పిడి రామచంద్రరావు తెలిపారు.

ఆర్.వెంకంపేట ఉన్నత పాఠశాలను ఎంపీడీవో సందర్శన

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని ఆర్ వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడిఓ సిహెచ్ వెంకటరావు బుధవారం నాడు సందర్శించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించి, పాఠశాలలో జానా భోజనం పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు దగ్గరుండి ఆహారపదార్థాలను వడ్డించారు. పాఠశాల విద్యార్థుల హాజరును, స్కూల్‌నందు ఉన్న టాయిలెట్స్ పరిశీలించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్నచిన్న సమస్యలను సచివాలయ కార్యదర్శికి తెలియ జేసి గ్రామస్తులను అవగాహన కల్పించి పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ కాగాన వెంకటనాయుడు, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అంటిపేట గ్రామ సచివాలయంను ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించడమే గాక ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

కేంద్ర వైద్య బృంద సభ్యులు, సిఆర్‌ఎం టీమ్ జిల్లాలో పర్యటన

క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందుతున్న తీరుపై పరిశీలన

విశాలాంధ్ర-బెలగాం/ పాలకొండ/ వీరఘట్టం : గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరుపై కేంద్ర వైద్య బృంద సభ్యులు (సిఆర్‌ఎం టీమ్) బుధవారం జిల్లాలో పర్యటన చేసి పరిశీలించారు. కామన్ రివ్యూ మిషన్‌లో బాగంగా డా. దీపికా శర్మ, డా.రమణ, డా.నీరజ్‌కుమార్‌లతో కూడిన బృంద సభ్యులు వీరఘట్టం, పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రుల్లో తనిఖీలు చేపట్టారు. తొలుత జిల్లా కలెక్టర్ తో కలెక్టరేట్‌లో సమావేశమై జిల్లాలో ఆరోగ్య పరిస్థితులు, వైద్య సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు పరిశీలనలో భాగంగా ఆరోగ్య కార్యక్రమాలు ద్వారా ప్రజలకు ఏరీతిన వైద్య సేవలు అందిస్తున్నారు, ప్రభుత్వ పథకాలు ఏ మేరకు చేరువవుతున్నాయో రాష్ట్ర బృంద సభ్యులతో కలిసి పరిశీలన చేశారు. వైద్య అదికారులు, వైద్య సిబ్బంది లతో సమీక్షించి ఆరోగ్య కార్యక్రమాలపై ఉన్న పరిజ్ఞానాన్ని, పని తీరు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రి వివిధ విభాగాలను ఆవరణ పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరు పరిశీలించారు. ఐఈసి గోడ పత్రికల ప్రదర్శన తిలకించారు. గ్రామీణ ప్రజలతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై తెలుసు కున్నారు. జిల్లాలో అధిక భాగం గిరిజన, గ్రామీణ ప్రాంతాలతో కూడిన, భౌగోళిక పరిస్థితులతో కొంతవరకు అవాంతరాలు చోటుచేసుకున్నపటికీ వైద్య సేవలు అందిస్తున్న తీరుపై బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో చేపట్టిన పరిశీలనల నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు సంచాలకులు డా.అనిల్‌కుమార్, డిఎం & హెచ్‌ఓ డా.ఎస్. భాస్కరరావు, డిసిహెచ్‌ఎస్ డా. గొర్లి నాగభూషణరావు, వైద్య శాఖ జిల్లా అధికారులు డా. విజయ మోహన్, డా.టి.జగన్ మోహనరావు, డా. రఘు కుమార్, సూపరింటెండెంట్ డా.చిరంజీవి, వైద్యాధికారి డా. ప్రదీప్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెంటాడను మన్యంలోకి మార్చాలి

గిరిజన విశ్వవిద్యాలయం ముద్దు... గిరిజన జిల్లా వద్దు అనడం సరికాదు...

సిపిఐ నాయకులు ఆర్వీఎస్ కుమార్

విశాలాంధ్ర-సాలూరు : జిల్లాల పునర్విభజన ఉంటుందని చర్చనీయాంశం అవుతున్న నేపథ్యంలో సాలూరు నియోజకవర్గం మెంటాడ మండల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. దీనిపై పార్వతీపురం మన్యం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గసభ్యులు ఆర్‌విఎస్ కుమార్ బుధవారం విలేఖరులతో మాట్లాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాలు సాలూరు నియోజకవర్గం (ఎస్టీ)లో ఉన్నాయి. అత్యధిక గిరిజన జనాభా ఉన్న మండలాలలో మెంటాడ ఒకటి. సాలూరు నియోజకవర్గం మన్యం జిల్లాలో ఉన్నప్పటికీ మెంటాడ మాత్రం విజయనగరం జిల్లాలో కొనసాగుతుంది. గత ప్రభుత్వం కొన్ని ప్రత్యేక కారణాలను చూపుతూ విజయనగరం జిల్లాలోనే మెంటాడ మండలాన్ని కలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని ఒకవర్గం స్వాగతించగా, గిరిజనులు మాత్రం వ్యతిరేకించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలు పార్వతీపురం రెవిన్యూ డివిజన్‌లో ఉండగా, మెంటాడ మాత్రం బొబ్బిలి రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఒక నియోజకవర్గం ఒకే రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉండాలని తీసుకున్న నిర్ణయం మేరకు మార్పు అనివార్యమని భావిస్తున్నామని కుమార్ తెలిపారు. పునర్విభజన జరిగితే మెంటాడను మన్యం జిల్లాలో కలపాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి గల కారణాలను కూడా తెలియజేశారు. గత ప్రభుత్వం కాలంలో 2023 ఆగస్టులో గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లు మెంటాడ మండలంలో నిర్వహించారు. రాష్ట్ర విభజన తరువాత తెదేపా ప్రభుత్వం కొత్తవలస మండలం రెల్లి సమీపంలో గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం కొరకు శంకుస్థాపన గావించి ప్రహారీగోడ నిర్మాణం చేపట్టింది. వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తరువాత గిరిజన విశ్వవిద్యాలయం గిరిజన ప్రాంతంలోనే నిర్మించాలని నిర్ణయించుకొన్నారు. దీనికి అనుగుణంగా సాలూరు నియోజకవర్గం కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న దుగ్ధసాగరం భూములను పరిశీలించారు. అలాగే మెంటాడ మండలం కుంటినవలస గ్రామ సమీపంలో భూములను పరిశీలించారు. గిరిజన యూనివర్శిటీ ప్రతినిధి బృందం గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మెంటాడ మండలంలో భూములు అనుకూలం అని నివేదిక సమర్పించారు. దీనితో మైదాన ప్రాంతం అయిన రెల్లి కన్నా గిరిజన నియోజకవర్గం అయిన సాలూరులో ఉండటం శుభ పరిణామమని అందరూ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంలో మెంటాడ వాసులు తమ ప్రాంత భూములకు రేట్లు పెరుగుతాయని భావించి సాలూరు నియోజకవర్గంలో భాగంగా ఉన్న మెంటాడ మండలంలోని గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని గిరిజన విశ్వవిద్యాలయ ప్రతినిధులను అభ్యర్థించారు. మెంటాడలో కూడా గిరిజన జనాభా అధికంగా ఉండటం చేత గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లు అవుతుందని గిరిజన యూనివర్శిటీ నిర్మాణం కోసం వచ్చిన బృందానికి నచ్చజెప్పారు. గిరిజన యూనివర్శిటీ నిర్మాణం కొరకు అందరిని కలిసి అభ్యర్థించిన మెంటాడవాసులు మన్యం జిల్లాలో చేరేందుకు మాత్రం అయిష్టత చూపడం సరికాదని కుమార్ అన్నారు. మెంటాడ మండలం, ఆ ప్రాంత అభివృద్ధికి గిరిజన యూనివర్శిటీని వినియోగించుకొని, ఇప్పుడు విజయనగరం జిల్లాలో కొనసాగించాలని డిమాండ్ చేయడం హేయనీయమన్నారు. గిరిజనులు అధికంగా ఉండటం చేత మెంటాడ మండలాన్ని మన్యం జిల్లాలో కలిపి గిరిజనులకు లబ్ధి చేకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్యతో చర్చించి త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సమస్యను విన్నవిస్తామని తెలియజేశారు.

మద్యం దుకాణం నిర్వహణకు రీ-నోటిఫికేషన్

- నవంబర్ 10వరకు దరఖాస్తుకు గడువు

- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్.గౌరీశ్వరరావు

విశాలాంధ్ర-పాడేరు : రాష్ట్ర కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, విజయవాడ వారి ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కీలక ప్రకటన వెలువడింది. జి. మాడుగుల మండలంలో మద్యం దుకాణం నిర్వహణకుగాను అధికారులు రీ-నోటిఫికేషన్ జారీ చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ దుకాణం నిర్వహణ కోసం జరుగు ఆక్షన్‌లో (వేలం) పాల్గొనాలని కోరుతున్నారు. ఇందుకోసం, వేలంలో పాల్గొనేవారు తిరిగి చెల్లించబడన(నాన్ రిఫండబుల్) రూ 2,00,000/- (రెండు లక్షల రూపాయలు) చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ నవంబర్ 10, 2025 సాయంత్రం 05:00 గంటల వరకు అని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్. గౌరీశ్వరరావు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని, ఆక్షన్‌కు సంబంధించిన ఇతర పూర్తి వివరాల కోసం పాడేరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అవిశ్వాస తీర్మానం విఫలం

విశాలాంధ్ర-హుకుంపేట : మండల పరిషత్ అధ్యక్షులపైన తొమ్మిది మంది ఎంపీటీసీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం విఫలమైంది. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి బుధవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశా నికి కోరిన ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడంతో ఈ తీర్మానం రద్దయిందిని ప్రత్యేక అధికారి ఆర్డిఓ లోకేశ్వరరావు తెలిపారు. గత నెల 10న తొమ్మిది మంది ఎంపీటీసీలు, ఎంపీపీ పైన అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌కు నోటీసు ఇచ్చారు. ఆ నోటీసు ఆధారంగా, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నవంబర్ 5న మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టుగా ఎంపీటీసీలందరికీ నోటీ సులు జారీ చేశారని ఆయన తెలిపారు.నిన్నటి రోజున జరిగిన ప్రత్యేక సమావేశానికి నోటీసులు అందుకున్న ఏ ఒక్క ఎంపీటీసీ కూడా హాజరు కాలేని కారణంగా, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టబడ లేదు అని ఆయన తెలిపారు. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి కేటా యించిన ఒక గంట సమయం దాటినందున, సమావేశం రద్దయిన ట్టు ఆయన ప్రకటించారు. నిబంధనల ప్రకారం, ఒక టర్మ్ పీరియడ్‌లో అవిశ్వాస తీర్మానాన్ని ఒక్క సారి మాత్రమే ప్రవేశపెట్టడానికి వీలు పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

గంజాయి జోలికి పోవద్దు... జైలు పాలు కావద్దు..

అరకు సీఐ హిమగిరి

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : గంజాయి జోలికి పోవద్దు జైలు పాలు కావద్దు అని అరకు సీఐ హిమగిరి అన్నారు. మండలంలోని కంద్రుం పంచాయితీ కేంద్రం ఎస్ ఐ పాపి నాయుడు ఆధ్వర్యంలో గంజాయి వల్ల కలిగే నష్టాలు, అనర్థాలపై గిరిజనులకు అవగాహన పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి పండించిన, రవణ చేసిన, సేవించిన చట్టరీత్యా నేరమని, అటువంటి పనులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలతో పాటు జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందన్నారు. ఇటువంటి చెడు పనులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని చెప్పారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ హరి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

11, 300 నగదు స్వాధీనం

విశాలాంధ్ర-కొయ్యూరు : అల్లూరి జిల్లా నవంబర్ 5: పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి తొమ్మిది మంది పేకాటరాయుళ్ల ను కొయ్యూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కొయ్యూరు ఎస్ ఐ కిషోర్ వర్మ అందజేసిన వివరాల ప్రకారం.. మండలంలోని మర్రివాడ పంచాయతీ దొడ్డవరం గ్రామంలో జూదం ఆడుతున్నారనే ముందస్తు సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్ఐ కిషోర్ వర్మ ఆధ్వర్యంలో సిబ్బంది జూద క్రీడ నిర్వహిస్తున్న శిభిరంపై దాడిచేసారు. ఈ దాడిలో పేకాడుతున్న తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి 11,300 నగదు స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా జూద మాడిన, జూద క్రీడాలు నిర్వహించిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ కిషోర్ వర్మ హెచ్చరించారు.

ఘనంగా రొంపల్లి పంచాయితీ గూడెంలో విద్యుత్ సౌకర్యం ప్రారంభం

- యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభం

- పాల్గొన్న అరకు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు

విశాలాంధ్ర-అనంతగిరి :ఈరోజు అనంతగిరి మండలం రొంపల్లి పంచాయితీ గూడెం గ్రామంలో విద్యుత్ సౌకర్యం ప్రారంభం చేశారు. అనంతగిరి మండల అధ్యక్షులు చిట్టం మురళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యలమంచిలి శాసనసభ సభ్యులు విజయ్ కుమార్ పాల్గొన్నారు. అరకు నియోజకవర్గ జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పర్సన్ చెట్టి చిరంజీవి, తదితర నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు ఈ సందర్భంగా యలమంచిలి శాసనసభ్యులు శ్రీసుంధరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కూడా లేదని చలించిపోయారని ఇరవయ్యో శతాబ్దంలో కూడా విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలను చూడటం బాధాకరమని, అందుకే మార్పు కోసం, భావితరాల భవిష్యత్ కోసం జనసేనాని అడుగుజాడల్లో నేడు గిరిజన యువత తరలి వస్తుందని అన్నారు. రాజకీయాలకంటే కూడా ఇటువంటి ప్రారంభ కార్యక్రమాలు వ్యక్తిగతంగా సంతృప్తినిచ్చిన కూడా ఇంకా ఇటువంటి గ్రామాలను అభివృద్ధికి దూరంగా ఉండటం అసంతృప్తిగానే ఉందని కూటమి ప్రభుత్వం హయంలో ఒక్కొక్కటిగా గిరిజన ప్రాంతంలో అలుముకున్న అభివృద్ధి ఆటంకాలను దాటుకుంటూ ముందుకు సాగుతామని అన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు నిరంతరం ప్రజా సేవకు సిద్ధంగా ఉండాలని నీతినిజాయితీగా తమ పని చేయగలిగితే వారి ఆశీర్వాదాల ఫలితమే రేపటికి మీరు గొప్ప నాయకులుగా తయారు కాగలరాన్నారు. గూడెం గ్రామస్తులకు హామీ ఇస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో ప్రత్యేకంగా మాట్లాడి అంగన్ వాడీ భవనం, పాఠశాల భవనం ఒకేచోట సంయుక్తంగా నిర్మిస్తామని, తాగు నీటి సౌకర్యం, ప్రధాన రహదారికి సుమారు 7 కిలోమీటర్ల దూరం రహదారి సౌకర్యం బాగుచేస్తామని మౌలిక సదుపాయాల కల్పన అంశం చర్చించి అమలయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గం పి.ఓ.సి ఆచెట్టి చిరంజీవి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడీ, ఐటీ ఇంచార్జీ డి.నవీన్ కుమార్, అనంతగిరి మండల అధ్యక్షులు చిట్టం మురళి, జనసేన మండల నాయకులు పాంగి లక్ష్మణ్,రొంపల్లి పంచాయతీ జనసేన నాయకులు కళ్యాణ్, పైడితల్లి, టీడీపీ నాయకురాలు, నిర్మల, లక్ష్మి, ఈస్టర్న్ పవర్ డిస్ట్రీ బ్యూట్ అధికారులు, ఇంజనీరు అధికారులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు

- తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

- సిపిఐ మండల కార్యదర్శి సింహాంచలం డిమాండ్

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన గిరిజన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ మండల కార్యదర్శి కె. సింహం చలం డిమాండ్ చేశారు. మండలంలోని గుంట సీమ పంచాయితీ లక్క గ్రామంలో బుధవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు ఏడాది పాటు అష్ట కష్టాలు పడి అప్పులు చేసి కూరగాయలతో పాటు వివిధ దినుసులు పండించారని, చేతికందే సమయంలో తుపాన్ కారణంగా తీవ్రంగా గిరిజన రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్క గ్రామానికి చెందిన గొల్లూరి గాసి అనే గిరిజనుడు అరా ఎకరంలో 30 వేల రూపాయలు పెట్టుబడి చేసి క్యా బాజీ పండించాడనితుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయాడని చెప్పారు. పేద గిరిజన రైతులు వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారని చెప్పారు. పంట చేతికందే సమయానికి తుఫాన్ ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపోయిన గిరిజనులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వానికి కోరారు.

జిసిసి చైర్మన్ కిడారి అనుచరుడు బరితెగింపు..!

రాజకీయ అండదండలతో పెట్రేగిపోతున్న వైనం

విశాలాంధ్ర-పాడేరు : రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అనుచరుడు గంపరాయి. మలేష్ బెదిరింపు చర్యలు ఎక్కువయ్యాయి. రాజకీయ అండదండలతో ఇష్టానుసారం వ్యవహరిస్తూ అధికారులను, పాత్రికేయులను తూలనాడుతూ వ్యవహరిస్తున్న అతను తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చింతపల్లి లో గత కొన్నెలుగా ఒక భవనానికి సంబంధించి వివాదం కోర్టులో కేసు నడుస్తుంది. కోర్టు నుంచి తీర్పు ఇంకా రాలేదు. కాకపోతే కోర్టులో కేసు నడుస్తున్నే ఉన్న సందర్భంలో ఆ ఇంటిని కిడారి శ్రావణ్ కుమార్ అనుచరుడు గంపరాయి మలేష్ కొన్నట్లు డాక్యుమెంట్లు సృష్టించి గత నెల చివర్లో కిడారి శ్రావణ్ కుమార్ అనుచరులతో కలిసి వెళ్ళి ఆ భవనంలో నివాసం ఉంటున్న కుటుంబాలని భయభ్రాంతులకు గురిచేస్తు ఖాళీ చేయాలని ఈ ఇంటిని నేను కొన్నానని ఖాళీ చేయకపోతే బాగోదని బెదిరింపులకు దిగడం జరిగింది. కోర్టులో కేసు నడుస్తున్నే ఉందని మీరు ఎలా కొనుగోలు చేస్తారని అక్కడివారు నిలదీస్తూ.. వీడియో తీస్తుంటే అక్కడ నుండి జారుకున్నారు. ఇదే విషయాని మీడియా జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకొని వెళ్లి వివరించడం జరిగింది. మలేష్‌కు ఈ విషయం తెలుసుకొనీ బుధవారం స్థానిక పాత్రికేయులపై ఇష్టమొచ్చినట్లు దూషిస్తూ మీ సంగతి కూడా తెలుస్తానాని, బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇటీవల కాలంలో కిడారి శ్రావణ్ అండదండలతో అతని అనుచరుడు మల్లేష్ ఇదే రీతిన బెదిరింపు దోరణలు వ్యవహరిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. కిడారి శ్రావణ్ కుమార్ ఈ విషయంలో జోక్యం చేసుకొని అతన్ని కట్టడి చేయాలని, లేదంటే ప్రజలే తగురీతిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ప్రకృతి సహజసిద్ధ ఎరువులు వాడాలి

విశాలాంధ్ర-జి.మాడుగుల : రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని ఎం. నిట్టాపుట్టు ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ మేడ ప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం కోరాపల్లి పంచాయతీలో రైతులకు సహసిద్ధ వనరులతో తయారు చేసుకోనే ఎరువులపై అవగాహన కల్పించారు. బీఆర్‌పీ కేంద్రాల ద్వారా వ్యవసాయ పంటలకు అసరమైన సలహాలు, సూచనలు అందించారు. సహజ వనరులతో తయారు చేసుకోనే కాషాయలు, జీవమృతాలపై వివరించారు. వీటిని వాడకంతో భూమితో పాటు రైతులు ఆరోగ్యంగా ఉంటారని ప్రసాద్‌రావు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎ.చిన్నతల్లి ఎంపీటీసీ సభ్యురాలు నానాజీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సన్యాసినాయడు, రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ముత్యాల జయలక్ష్మి(భర్త) లక్ష్మణరావు, కోట్ల రామయ్య (తండ్రి) వెంకటస్వామి వారికి సంబంధించిన ఇండ్లు విద్యుత్ షార్ట సర్క్యూట్ కారణంగా బుధవారం ఉదయం 10 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి, ఇంటిలోని సామాగ్రి వస్తువులు సర్టిఫికెట్లు కాలి బూడిద అయినవి. ఈ ప్రమాద సమయంలో బాధిత కుటుంబాల వారు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి వెళ్లి ఉండగా అగ్నిప్రమాదం సంభవించిందనీ సమాచారం తెలిసిన వెంటనే రెవిన్యూ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని జరిగిన నష్టం 15లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ దృష్టికి మండల సమస్యలు

విశాలాంధ్ర-ఎటపాక : ఎటపాక మండల సమస్యలు మంత్రి నారా లోకేష్ దృష్టికి ఎటపాక బీజేపీ నాయకులు నలాజల శ్యామ్ తీసుకెళ్లారు. బుధవారం మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌ని, మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ని కలిసి సమస్యలు వివరించారు. ఎటపాక మండల రెవెన్యూ సమస్యలను, ప్రజా సమస్యల వేదిక ఐన మీ కోసంలో పెడుతున్న పీజీఆర్‌ఎస్‌ల విషయంలో అధికారులు సకాలంలో స్పందించని వారిపై చర్యలు తీసుకునేలా పిఆర్‌జిఎస్ సెల్ ఉండాలని, ఎటపాక మండలంలో డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పక్క మండలాల్లోకి వెళ్ళి చదుకునే పరిస్థితి ఏర్పడింద న్నారు. విద్యార్థులు కోసం ముంపులేని ప్రాంతంలో డిగ్రీ కళాశాల, శాశ్వత జూనియర్ కళాశాల కట్టించాలని తెలిపి వినతి అందించారు. మంత్రిగారు సానుకూలంగా స్పందించి త్వరలోనే ఈ సమస్యల్ని పరిష్కరిస్తా మని హామీ ఇచ్చారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ కళాశాలవిద్యార్థులకు ఆన్ జాబ్ తరగతులు

విశాలాంధ్ర-సీతానగరం : ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అనుమతితో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎంఈటి,సిఈటి వొకేషనల్ విద్యార్థులకు చెల్లంనాయుడువలస శ్రీనివాస పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులు దాసరి రామకృష్ణ, దాసరిశివకుమార్‌లు ఆధ్వర్యంలో ఆన్ జాబ్ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 35రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈసమయంలో విద్యార్థులు, ఫైలింగ్, డ్రిల్లింగ్, వెల్డింగ్, ఆటోమొబైల్, మరియు సర్వేయింగ్ ప్రాక్టికల్స్ పై అవగాహన కల్పిస్తామని అధ్యాపకులు చెప్పారు.

పీహెచ్సీలో కుక్కలు, పిల్లులు విషసర్పాలు విహారం

- బాధ్యతారాహితంగా వైద్య సిబ్బంది
- ఆందోళన చెందుతున్న రోగులు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్లే రోగులకు అక్కడి పరిస్థితులను చూసి భయభ్రాంతులు చెందుతున్నారు. ప్రభుత్వ వైద్యం మాట పక్కన పెడితే, ఆ పిహెచ్‌సికి వెళ్తే ఏ ప్రమాదం జరుగుతుందో..? ఏ కుక్క కరుస్తుందో..? ఏ విషసర్పం కాటేస్తుందో అన్న ఆందోళన నెలకొంది. సమయానికి ఆ పీహెచ్సీకు వైద్యులు, సిబ్బంది వస్తారో... రారో తెలియదు కానీ కుక్కలు, పిల్లిలు, విష సర్పలు మాత్రం పీహెచ్సీ లోపలే సంచరిస్తూ దర్శనమిస్తాయి. ఇదంతా ఏజెన్సీలోని ఎక్కడో మారుమూల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకున్న సంఘటన అనుకుంటే పొరపాటే. జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలంలోని బంధలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సంఘటన సర్వత్రా చర్చనీయాసం అవుతుంది. ఈ పీహెచ్సీ లో గతంలో వైద్య సేవలు ఎంతో మెరుగ్గా అందేవి. అప్పట్లో విధులు నిర్వహించిన డాక్టర్ తిరుమల ప్రసాదు రోగులతో మమేకమై సకాలంలో పీహెచ్సీ కు వచ్చి సమయానుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహించి మంచి గుర్తింపు పొందారు. ఆయనకు సహాయ వైద్యుడిగా డాక్టర్ శ్రీకాంత్ రోగులకు చేసిన సేవలు కూడా ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు. అయితే ఇటీవల

రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల బదిలీ చేపట్టడంతో ఆ ఇద్దరు వైద్యులు ఇతర పీహెచ్సీలకు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ఇటీవల బందులుప్పి పీహెచ్సీకి వైద్యాధి కారిగా వచ్చిన శంకర్రావు ఎప్పుడు వస్తారు? ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. వైద్యుడే సకాలంలో అందుబాటులో లేకపోవడంతో వైద్య సిబ్బంది విధి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. వాస్తవానికి పీహెచ్సీ స్థాయిలో సేవలు అందించేందుకు ఏఎన్ఎంలు, ఇతర ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టు తదితరులతోపాటు వాచ్‌మెన్ స్వీపరు అందుబాటులో ఉండాలి. అయితే వారెవరు కూడా పూర్తిస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హాజరు కాకపోవడంతో రోగుల అవస్థలు అన్ని ఇన్ని కాదు. వైద్యుడు సిబ్బంది పనికిరు అస్తవ్యస్తంగా ఉన్న ఈ తరుణంలో పీహెచ్సీలో ఊర కుక్కలు బిల్లులు విశ్వసర్పాలు, సంచరించడం మరింత బాధాకరం. ఈ జీవులు కూడా ప్రసూతి గదికి ఎదురుగా ఉండడం గర్భిణీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా దీనిపై వైద్యశాఖ అధికారులు దృష్టి సారించి ఎంతో చరిత్ర కలిగిన బంద లుప్పి ఆరోగ్య కేంద్రాన్ని సక్రమమైన మార్గంలో ఉంచి రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదివాసీ ప్రాంతాల్లో సహజ వ్యవసాయ పద్ధతులపై క్షేత్ర పర్యటన

విశాలాంధ్ర-సీతంపేట : మండలం ఆదివాసి ప్రాంతాలలో సహజ వ్యవసాయ పద్దతులు అవలంభించడం ద్వారా నేల సంరక్షణ మరియు ఆరోగ్యం ఆహారం అభివృద్ధి జరుగుతుందని క్షేత్ర పర్యటనలో పహాడ్ సింగ్ జనరల్ మేనేజర్ నాబార్డు ప్రాంతీయ కార్యాలయం ఆంధ్రప్రదేశ్ వారు

తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహజ వ్యవసాయ పద్ధతులపై క్షేత్ర సందర్శనకు వచ్చిన విదేశీ ప్రతినిధులకు జీవా కార్యక్రమాలు మరియు నేల సంరక్షణ పాతవిత్తన రక్షణ గురించి తెలిపారు నాబార్డ్ సహకారంతో ఆర్ఫ్ సంస్థ ద్వారా జీవా కార్యక్రమాలు ఆదివాసి ప్రాంతాల్లో సహజ వ్యవసాయ పద్ధతులలో క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఐఎఫ్ఏడి (ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చర్ డెవలప్మెంట్), మాళవిక (అగ్రికల్చర్,ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్మెంట్ కార్పొరేషన్) సంబంధించిన అధికారులు బుధవారం నాడు సీతంపేట మండలంలో బూర్జగూడ, గుజ్జి, దుగ్గి .చిన్న పొల్ల, జయపురం గూడ, గడి గుజ్జి గ్రామాల్లో సందర్శించారు. ఈ ప్రాంతాల్లో జీవ కార్యక్రమంలో జరుగుతున్న ఏ3 మోడల్ (ఆహారం - ఆరోగ్యం -ఆదాయం) అలాగే వనం మోడల్ లో రైతులకు సహజ వ్యవసాయ పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తిని పొంది పూర్తిగా సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించి వాటికి విలువ ఆధారిత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు అలాగే ఈ ప్రాంతాల్లో బయో రిసోర్స్ సెంటర్ ద్వారా ఆవు మూత్రం, పేడ ద్వారా ఘన జీవామృతం, ద్రవ జీవ అమృతం, కషాయాలు తయారు చేసి రైతులకు భవిష్యత్తు తరాల్లో రసాయనికి పురుగుమందులు లేని వ్యవసాయ ప్రాంతాలు తయారు చేయడం జరుగుతుందని నూక. సన్యాసిరావు డైరెక్టర్ ఆర్ఫ్ వారు వివరించారు.విదేశీ ప్రతినిధులు కన్సల్టెంట్-ఉజ్వల దండేకర్, దినేష్ కుమార్ రెడ్డి డిడిఎం నాబార్డు. పార్వతీపురం, రమేష్ కృష్ణ డిడిఎం నాబార్డు శ్రీకాకుళం, రేఖ అసిస్టెంట్ మేనేజర్. మా తోట ఎఫ్ పిఓ- రవీంద్రనాథ్ బట్లు, మన్యం సహజ సీఈఓ శంకర్రావు, కోఆర్డినేటర్ సందీప్ కుమార్, జీవ కోఆర్డినేటర్ కృష్ణ, డెవలప్మెంట్ అసోసియేట్ మనీషా, లావణ్య ఆర్ఫ్ సిబ్బంది గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని విదేశీ ప్రతినిధులకు ఆహ్వానం పలికారు.

పాలకొండ పాత రెవిన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలి లేదా శ్రీకాకుళం జిల్లాలో కలపాలి

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు పాలకొండ జిల్లా సాధన సమితి విజ్ఞప్తి

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని లేనిచో పాత శ్రీకాకుళంలో పాలకొండను కలపాలని బుధవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవితో కలిసి శ్రీకాకుళం రూరల్ కల్లేపల్లి గ్రామంలో కలసి సాధన సమితి సభ్యులు విజ్ఞాపన పత్రం అందించడం జరిగింది. పాలకొండ పాత రెవెన్యూ డివిజన్ ను జిల్లా చేయాలి లేదా శ్రీకాకుళం జిల్లాలో కలపాలని కోరుతూ జరుగుతున్న ఉద్యమం గురించి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లాల పునర్విభజన జరిగిన నష్టాన్ని పూడ్చడానికి నావంతు ప్రయత్నం చేస్తానని, మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని ప్రత్యేకంగా లేవనెత్తానని హామీ ఇచ్చారు. గౌరవ మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసిన వారిలో సాధన సమితి గౌరవ అధ్యక్షులు కనపాక చౌదరి నాయుడు, అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు, సాధన సమితి నాయకులు సబ్బ నానాజీ,తుమ్ముగుంట శంకర్రావు,రుంకు రామకృష్ణ, ప్రెస్

క్లబ్ అధ్యక్షులు వల్లూరు సత్య నారాయణ, తెలుగుదేశం పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు గుమ్మడి సింహాద్రి,బిజెపి నాయకులు పవన్ సాయి, పైల అక్కల నాయుడు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు వెన్నపు వెంకట రమణ, దుంపల రమేష్ బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు దుప్పాడ గణేష్, శాసపు సర్వారావు, గుమ్మడి గోవిందరావు, గుడివాడ నీటి సంఘం డైరెక్టర్ పామోటి వైకుంఠరావు, భాసూరు శివశంకర ప్రసాద్ సాధన సమితిసమితి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంచు దుప్పట్లో ఆంధ్ర ఊటీ

ఆహ్లాదభరితులవుతున్న పర్యాటకులు

విశాలాంధ్ర-అరకులోయ : ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఆంధ్ర ఊటి అందాల అరకులోయ మంచు ముసుగులో దర్శనమిస్తూ పర్యాటకులను స్థానికులను మంత్రముగ్ధులకు గురిచేస్తుంది. ఈ సీజన్లో మంచు కురవడం సర్వ సాధారణం అయినప్పటికీ గతంలో ఎన్నడు లేని విధంగా ప్రతిరోజు దట్టంగా మంచు కురుస్తూ పర్యాటకులను స్థానికులను ఆనంద అనుభూతులకు గురిచేస్తుంది. అపర కాశ్మీర్‌గా పేరు ప్రఖ్యాతలు పొందిన ఆంధ్రఊటి అరకులోయ సీజన్ ప్రారంభంలోనే మంచు దుప్పటి కప్పుకుని పర్యటకులను స్థానిక ప్రజానీకానికి అబ్బురపరుస్తూ ఆచార్యానికి గురిచేస్తుంది. గతంలో మంచు కురిస్తే ఉదయం ఏడు గంటలకు సూర్యోదయం కనిపించేది అయితే ప్రస్తుతం ఉదయం 10 గంటలు కావస్తున్న సూర్య దర్శనం లేక పట్టపగలే హెడ్లైట్లు వేసుకొని వాహనాలు నడపవలసిన పరిస్థితిలు ఈ ప్రాంతంలో నెలకొన్నాయి. దట్టంగా కురిసే మంచు వలన పర్యాటకులు ఆహ్లాదభరితులు అవుతుండగా స్థానికులు సకాలంలో కూలి పనులకు వెళ్లలేక పలు అగచాట్లు పడుతున్నారు. ఇది ఇలా ఉండగా మంచు ముసుగులో దర్శనమిస్తున్న అరకులోయ అద్భుత అందాలను తిలకించి సందర్శకులు పులకించిపోతున్నారు. మంచు దృశ్యాలలో సెల్ఫీలు దిగుతూ తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు.ఆంధ్రఊటి అరకులోయ అంటేనే ఒక అద్భుతమని ఈ అద్భుతానికి మంచు అందాలు తోడైతే మహా అద్భుతం అని సందర్శకులు గొప్పగా పేర్కొంటున్నారు. అరకులోయలో రెండు రోజుల విహారానికి వచ్చి ఇక్కడ అద్భుత అందాలు తిలకించి మరో రెండు రోజులు పొడిగించుకుని ఆహ్లాదభరితంగా గడుపుతున్నామని పర్యాటకులు పేర్కొంటున్నారు.ఇటువంటి అద్భుత అందాల మధ్య ఎన్ని రోజులు విహరించిన అద్భుత అందాలను వర్ణించడం వర్ణనతీతమని పర్యాటకులు చెప్పుకుంటున్నారు.

జిల్లాలో మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ డా. ఎస్.ప్రభాకర రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సి ఆర్ ఎం బృందానికి తెలిపారు.జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును, వాటి ప్రగతిని పరిశీలించి సమీక్షించేందుకు సీఆర్ఎం బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. ఈపర్యటనలో రాష్ట్ర మరియు జిల్లాస్థాయి ఆరోగ్య బృందాలతో పాటు సమన్వయ శాఖాధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాకలెక్టర్ సమీక్షాసమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యక్తిగత పరిశుభ్రత లోపం కారణంగా ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీనికి విద్యార్థి దశలోనే వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవసరమని గ్రహించి జిల్లాలోని ప్రతి అంగన్వాడీ, పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులకు ముస్తాబు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. తద్వారా ప్రతీ తరగతి గదికి ఇద్దరు లీడర్లను ఏర్పాటుచేసుకొని ప్రతి విద్యార్థి పరిశుభ్రంగా ఉన్నారా, లేదా అని పరిశీలించి తరగతి గదిలోకి పంపడం జరుగుతుందని, అలాగే మధ్యాహ్న భోజన సమయంలో భోజనం ముందు, తదుపరి, మరుగుదొడ్ల వినియోగించిన తరువాత చేతులు పరిశుభ్రం చేసుకున్నదీ, లేనిదీ పరిశీలిస్తారని చెప్పారు. దీనివలన ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతకు అలవాటు పడతారని, అదేవిధంగా వారి ఇంటి వద్ద కూడా తల్లితండ్రులకు అలవాటుగా మారుతుందని కలెక్టర్ వివరించారు. అలాగే జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉన్నందున పరిసరాల పరిశుభ్రత లోపం కారణంగా మలేరియా జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశముందని గుర్తించడం జరిగిందని అన్నారు. దీనికోసం మలేరియా కేసు నమోదైన గ్రామంలో మా ఊరికి మలేరియా వచ్చింది అనే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. తద్వారా ఆ గ్రామంలో మా ఊరికి మలేరియా వచ్చిందని, అందరూ జాగ్రత్తలు పాటించాలని దండోరా వేయించి ఇంటింటికి వెళ్లి మలేరియా నివారణ చర్యలను తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. తద్వారా జిల్లాలో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని వివరించారు. వీటితో పాటు దోమలు వ్యాప్తిచెందకుండా ఉండేందుకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతీ శుక్రవారం జిల్లాలో పక్కాగా అమలుచేస్తున్నట్లు కలెక్టర్ బృందానికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా దోమలను పూర్తిగా నివారించేందుకు చేపట్టవలసిన అంశాలతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.సీఆర్ఎం బృందం పర్యటన జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి, ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈసమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులుతో కూడిన రాష్ట్ర స్థాయి బృందం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కర రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి జి.నాగభూషణరావు, ఐసీడిఎస్ పథక సంచాలకులు టి.కనకదుర్గ, రెడ్ క్రాస్ సంస్థ, స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన అగ్రికల్చర్ అసిస్టెంట్‌కి అభినందన

విశాలాంధ్ర-జీకే విధి : గుండెపోటుతో అపస్మారక స్థితిలో ఉన్న, ఉపాధ్యాయుడిని సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన జీకేవిధి-2 సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ కృష్ణను వ్యవసాయ ఆశాఖ అధికారులు దుస్సాలవతో సన్మానించి ఆయనకు అభినందించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏడీఏ మధుసూదన్, జీకేవిధి ఏఓ గిరిబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఐపై డిగ్రీ కళాశాల అధ్యాపకులకు కొనసాగుతున్న ఆన్లైన్ శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-పార్వతీపురం: ఉన్నతవిద్యా మండలి ఆదేశాలమేరకు అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో అధ్యాపకులకు ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)పై శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఏఐ శిక్షణ తరగతులు స్టాఫ్‌కు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఫండమెంటల్ ఆఫ్ ఏఐ గూర్చి ఈశిక్షణాతరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడోరోజు బుదవారం ఆన్‌లైన్ శిక్షణ తరగతులలో అనంతపురం ప్రభుత్వ డిగ్రీకళాశాల కంప్యూటర్ అధ్యాపకులు డాక్టర్ ఉదయ్ భాస్కరరావు ఏఐ అప్లికేషన్స్ గూర్చి, దీనిలో భాగంగా హెల్త్ కేర్, ఫైనాన్స్, అగ్రికల్చర్, ట్రాన్స్ పోర్ట్,రిటైల్, కేంద్ర రాష్ట్రాల్లో ఏఐ ప్రాధాన్యత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు వైస్ ప్రిన్సిపాల్ & ఐక్యూఏసి కో ఆర్డినేటర్ బలగ శాంతకుమారి, సీనియర్ లెక్చరర్ కె.రోజా, అధ్యాపకులు ఎన్ సత్యనారాయణ,కొత్తాడ శంకరరావు, గుప్తా, ఎం.ఎల్లంనాయుడు, కె.శ్రీనివాసరావు, శంకరరావు, పల్లునరావు, వెంకటరమణ, బి.తిరుపతిరావు, ఎం.రమేష్, వైకుంఠరావు, ఎం సౌజన్య, ఉమామల్లేశ్వరి, గౌరీశంకర్రావు, టి.కిషోర్ కుమార్, సరేంద్ర, జగదీశ్వరరావు, హేమసుందరరావు, డాక్టర్ శంకరరావు, గణేశ్ కుమార్, మాధవనాయుడు,వాసు, నవీన్ కుమార్లు పాల్గొన్నారు.

దక్షిణామూర్తి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: స్థానిక విద్యా సర్వ మంగళ దేవి పీఠం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మేధా దక్షిణామూర్తి కు ప్రత్యేకంగా కార్తీక పుణ్యమాసం సందర్భంగా ప్రత్యేక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల్లోని ప్రత్యేక పూజల్లో భాగంగా బుధవారం పౌర్ణమి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు అలంకరణ నిర్వహించారు. రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర తో పాటు శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ దంపతులు హాజరై బ్రహ్మోత్సవాల్లో పాల్గొని మేధా దక్షిణామూర్తికే ప్రత్యేక పూజలు హారతి హెూమాలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసు శర్మ యాజ ప్రముఖ నాయకులకు పూర్ణ కలసి తో స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు నిర్వహించి దక్షిణామూర్తి యొక్క శాస్త్రాన్ని పఠించి ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణామూర్తి ఎంతో ప్రత్యేక శక్తిగల దేవతామూర్తిని, అటువంటి విగ్రహాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి కార్తీకమాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడమో ఈ ప్రాంత వాసులు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు.

బడి పక్కన ఆయిల్ బంకు

బంక్ తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్

విశాలాంధ్ర-ఎటపాక : ఎటపాక మండలం చోడవరం పంచాయతీ పరిధిలోని నల్లకుంటలో గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నూతన బంక్ నిర్మాణం చేపడుతున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల పక్కనే బంకు నిర్మాణం చేపట్టడంతో విద్యార్థుల తల్లి దండ్రులు భయందోనలకు గురవుతున్నారు. పెట్రోల్ బంకులకు, పాఠశాలలకు దగ్గరగా ఉండటం మంచిది కాదనీ ఇది విద్యార్థుల భద్రతకు ప్రమాదకరమని, పెట్రోల్ బంకులు అధిక మొత్తంలో ఇంధనాన్ని నిల్వ ఉంచుతాయి. కాబట్టి అవి అగ్ని ప్రమాదాల ప్రమాదాన్ని పెంచుతాయి. పాఠశాలలు సున్నితమైన ప్రదేశాలు, ఇక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉంటారు. కాబట్టి ప్రమాదకరమైన పరిస్థితులకు దూరంగా ఉండటం అందువల్ల, పాఠశాలల సమీపంలో పెట్రోల్ బంకులు నిర్మించకూడదనీ నిబంధన ఉన్న బంక్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నారు. పెట్రోల్ బంకుల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపిన పాఠశాలలకు, నివాసాలకు దూరంగా ఉండేలా నూతన నిబంధనలను విడుదల చేసింది. వీటిని చమురు సంస్థలు కచ్చితంగా పాటించాలని ఆదేశాలు వాటిన బేఖాతర్ చేస్తూ వాటి విరుద్ధంగా బంక్ నిర్మాణాలు చేపడుతున్నారు. విద్యార్థుల ప్రాణాలు లెక్కచేయకుండా చేపడుతున్న నిర్మాణం వెంటనే తరలించాలని విద్యార్థుల తల్లి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

కార్తీక పౌర్ణమి పర్వదినాన బౌడేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-చింతపల్లి : కార్తీక పౌర్ణమి పర్వదినాన బౌడేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని టిడిపి అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం అన్నారు. మండలంలోని కిటుముల పంచాయతీ బౌడ గ్రామంలో కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశ్రీశ్రీ బౌడేశ్వర ఆలయంలో భక్తులు అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే కార్యక్రమంలో భాగంగా పురాతన మూలవిరాట్ బౌడేశ్వర స్వామి సమేత సరస్వతి దేవి నందీశ్వరులను పురోహితులు వేదమంత్రాల నడుమ, ఓం నమశ్శివాయ నినాదాలతో స్వామి వార్లను ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, బౌడ గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాలనుండి వందల సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేయడం మానుకోండి

వైసిపి ప్రజాపతినిధులకు హితవు పలికిన బలపం పంచాయతీ వార్డు సభ్యులు లింగారావు, సోమరాజు

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని మారుమూల పంచాయతీ అయిన బలపం పంచాయతీలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ కనుమరుగవడం ఖాయమనే భయంతోనే తమ పార్టీలో ఉన్న వ్యక్తులు వేరే పార్టీలో చేరితే వైసీపీకి సంబంధం లేని వ్యక్తులుగా పోల్చి తప్పుడు ప్రచారం చేస్తూ ప్రకటనలు చేయడం వైసీపీ దిగజారుడు తనానికి నిదర్శనం అని వైసీపీ నాయకులు తమ పార్టీలో ఉన్న కార్యకర్తలు, నాయకులు ఎవరైనా తమ పార్టీని వీడి వేరే పార్టీలో చేరితే భయంతోనే వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బలపం పంచాయితీ వైస్ ప్రెసిడెంట్ కామరాజు, ఎం.పీ.టీ.సీ మచ్చమ్మను ఆ పంచాయతీ నుంచి జనసేన పార్టీలో చేరిన వార్డు సభ్యులు పాంగి లింగారావు, సిందేరి సోమరాజు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ పంచాయతీని కైవసం చేసుకునేందుకు వైసీపీలో తమ గెలుపు కోసం ఎంతో కష్ట పడ్డామని, కష్టపడినా గుర్తింపు లేకపోవడం వల్ల ఆత్మాభిమానం చంపుకోలేక జనసేన పార్టీలో చేరమన్నారు నేడు పంచాయతీల అభివృద్ధి కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోట్ల రూపాయల నిధులు మన్య ప్రాంతానికి విడుదల చేసినా, పంచాయతీలో వైసీపీ చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు వంతల బిట్ నాయుడు, సిందరీ చిన్నయ్య, పాంగి కామేశ్వరరావు, పాంగి సన్యాసిరావు, వంతల శ్రీను, వంతల మోహనరావు, వెంకట రావు,తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల నాటక పోటీలకు తరలిరండి

మేరంగి నాటక పరిషత్ అధ్యక్షులు రౌతు వాసుదేవరావు (వాసు మాస్టారు)

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని పెదమేరంగి కూడలి సమీపంలో శ్రీ సత్యకైలాస్ పాఠశాల ఆవరణలో ఈనెల 7, 8, 9 తేదీలలో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నాటక పోటీలను జయప్రదం చేయాలని మేరంగి నాటక పరిషత్ అధ్యక్షులు రైతు వాసుదేవరావు వాసు మాస్టారు. ప్రజలకు, కళాకారులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈనెల ఏడవ తేదీన స్వప్నం రాల్చిన అమృతం (కరీంనగర్ వారిచే) మా ఇంట్లో మహాభారతం అనే నాటిక చిలకలూరిపేట వారిచే ప్రదర్శించబడుతుందని అన్నారు 8వ తేదీన అసత్యం అనే నాటికను విశాఖపట్నం వారిచే గారడి నాటికను గుంటూరు వారిచే హైదరాబాద్ వారిచే అమ్మ చెక్కిన బొమ్మ నాటికను చినమేరంగి వారిచే మనిషి కన్నా శవం మిన్న అనే నాటికను ప్రదర్శించబడుతుందని తెలియజేసారు ఇవన్నీ రాష్ట్రస్థాయిలో ఉత్తమ నాటికలుగా పేరుపొందినవే అని ఆయన అన్నారు కేవలం ఇదంతా కల కోసం కాదు ప్రజల కోసం సామాజిక చైతన్యం కోసం మా ఈ ప్రయత్నం అని ఆయన అన్నారు. ఈ నాటక పోటీలను ప్రతి ఒక్కరు చూసి మా నాటక పరిషత్ ను ప్రోత్సహించాలని ప్రజలను కళాకారులను ఆయన కోరారు. కాగా చివరి వరకు ఉన్న వీక్షకులకు లాటరీ తీసి తద్వారా గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు వాన నారాయణరావు ప్రధాన కార్యదర్శి రౌతు విజయ్ కుమార్ కోశాధికారి రౌతు అజయ్ కుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం కిషోర్ ఉపాధ్యక్షులు బలగ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన నూతన ప్రొబేషనరీ ఏపిఎస్పీఆర్ఎస్సైలు

విశాలాంధ్ర-పార్వతీపురం: అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో మరియు గ్రే హౌండ్స్ లో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం 37 మంది నూతన ప్రొబేషనరీ ఏపిఎస్పీ ఆర్ఎస్సైలను ప్రాక్టికల్ శిక్షణనిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా కు కేటాయించగా, వారంతా జిల్లా పోలీస్ కార్యాలయం నందుజిల్లా ఎస్పీ ఎస్..వి.మాధవ్ రెడ్డిని బుదవారం మర్యాదపూర్వకంగా కలిశారు.పోలీస్ శాఖలోకి అడుగుపెడుతున్న వారితో ఎస్పీ ఛాంబర్లో సమావేశం ఏర్పాటు అభినందనలు తెలిపారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణల నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఈ ప్రాక్టికల్ శిక్షణలో వారికీ కేటాయించిన ఏజెన్సీపోలీస్ స్టేషన్లో ఏవిధంగా విధులు నిర్వర్తిన్చాలో తెలియజేస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. ముఖ్యంగా ఏజెన్సీప్రాంతాలను సందర్శించాలని, అక్కడ ప్రజలతో సమావేశం అయ్యి వారితో మమేకమై వారిద్వారా సరిఅయిన సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటుఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

నేడు పిహెచ్‌పిలకు అవగాహన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : స్థానిక బైపాస్ రహదారిలో గల సితార ఫంక్షన్ హాల్ లో ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించడం జరుగుతుందని పీహెచ్‌పి అసోసియేషన్ పార్వతిపురం మన్యం జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి.సింహాచలం, కార్యదర్శి నడిమింటి.గోపాలనాయుడు తెలిపారు. ఈ అవగాహన సమావేశానికి విశాఖపట్నంకు చెందిన మెడికవర్ వైద్యులు డాక్టర్ గొట్టాపు కిరణ్మయి(గైనకాలజిస్ట్) డాక్టర్ బుర్రా శివకుమార్, (గ్యాస్ ట్రాలజిస్ట్) రుద్ర బట్ల పవన్ కుమార్ (న్యూరాలజిస్ట్)లు పాల్గొని పీహెచ్పీ సభ్యులకు పలు వ్యాధులు వాటి నివారణ పైన సూచనలు, సలహాలు ఇస్తూ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమంలో సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అప్పయ్యపేట గ్రామంలో పంటకోత ప్రయోగ పరీక్షలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని అప్పయ్యపేట గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమంలోభాగంగా వరిపంటలో పంట కోత ప్రయోగంను బుధవారం నిర్వహించారు. పంట కోత ప్రయోగం అనేది ఒక నిర్దిష్ట ప్రాంతంలో (జిల్లా లేదా మండలం) వరి (లేదా ఇతర పంటలు) సగటు దిగుబడిని శాస్త్రీయంగా అంచనా వేయడానికి ఉపయోగించే ఒక పద్ధతన్నారు. పంటల బీమా పథకం, పంట ఉత్పత్తి అంచనాలు మరియు కరువు మండలాల గుర్తింపు వంటి ప్రభుత్వ నిర్ణయాలకు ఈ ప్రయోగాల ద్వారా వచ్చిన ఫలితాలే ప్రామాణిక మన్నారు. ఈకోత ప్రక్రియలో ఎఫ్‌టిసి వ్యవసాయ అధికారిని సృజన, మండల వ్యవసాయ అధికారి ఎస్ అవినాష్,వ్యవసాయ విస్తరణ అధికారు పి. లక్ష్మణ్, గణాంకాల శాఖ అధికారి సతీష్, వ్యవసాయ సహాయక సిబ్బంది శర్మ, వినయ్, సబ్బాన శ్రీనివాసరావు, బోగినాయుడు తదితర రైతులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు టిడిపి, జనసేన నాయకులు పరామర్శ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : సీతారామరాజు జిల్లా మండలంలోని సీతంపేట గ్రామంలో బుధవారం ముత్యాల జయలక్ష్మి (భర్త) లక్ష్మణరావు, కోట్ల రామయ్య (తండ్రి) వెంకటస్వామి వారి రెండు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధం అవడం జరిగిన సమాచారం తెలిసిన వెంటనే కూటమి నాయకులు సీతంపేట గ్రామంను సందర్శించి, అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి అపారమైన నష్టం కలిగిందని వారిని అధైర్య పడవద్దని మేము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు, ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షు బొర్రా నరేష్ కుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకల సాయి కృష్ణ, సీనియర్ నాయకులు బొర్ర నరసింహారావు, ముత్యాల సిద్దార్థ, సొసైటీ మాజీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, భాను, అంజన్‌రావు, పండు, తదితరులు పాల్గొన్నారు.

డిజిపిఓ గ్రామ పర్యటన

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : అల్లూరి జిల్లా

గ్రామ పంచాయతీ అధికారి, (డిజిపిఓ) చంద్రశేఖర్ రాజవొమ్మంగి మండలం విజువల్లి క్లీనింగ్ విలేజ్ అయిన కొండపల్లి గ్రామాన్ని బుధవారం సందర్శించారు, సర్పంచ్,డిప్యూటీ ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి మరియు సచివాలయం సిబ్బంది, సీఆర్పీలతో విజువల్లి క్లీనింగ్, గ్రామానికి సంబంధించిన ప్రత్యేక పారిశుధ్యం,ఎస్ డబ్ల్యు పిసి షెడ్‌ని ప్రత్యేక అభివృద్ధి కొరకు కొన్ని సలహాలు సూచనలు చేస్తూ ఈ గ్రామాన్ని ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దాలని అని డిప్యూటీ ఎంపిడిఓ విజయ్ కుమార్ కి,కార్యదర్శి హేమశ్రీకి సచివాలయం సిబ్బందికి తెలియజేసారు.

కృష్ణునిపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో రోడ్డుకిరువైపులా తుప్పలు తొలగింపు

విశాలాంధ్ర-దేవీపట్నం : దేవీపట్నం పంచాయతీ సంబంధించి కృష్ణునిపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో సర్పంచ్ కుంజం రాజమణి మరియు పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త తుప్పలను తొలగించడం జరిగింది. వర్ష కాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా దోమలకు మందు యాంటీ లార్వా ఆపరేషనల్ స్ప్రేయింగ్ చేయించడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి, దేవీపట్నం పంచాయతీ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పాడేరులో వాలంటీర్ల జయభేరి జయప్రదం చేయండి

పంచాయతీ వాలంటీర్ల అధ్యక్షులు గేమ్మల కోటిబాబు

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలంలోని వైసీపీ ప్రభుత్వంలో సచివాలయంలో వాలంటీర్లుగా విధులు నిర్వహించి పని చేసిన గ్రామ వార్డు వాలంటీర్లు పాడేరులో వాలంటీర్ల రణభేరి కార్యక్రమానికి పాల్గొవాలని రింతాడ పంచాయతీ గ్రామ వార్డు వాలంటీర్ల అధ్యక్షులు గెమ్మెలి కోటి బాబు కోరారు. ఈనెల 7 శుక్రవారం పాడేరులో వాలంటీర్ల జయభేరి కార్యక్రమానికి మండలంలోని వాలంటీర్లు అందరూ తరలిరావాలని, రింతాడ గ్రామ వార్డ్ వాలంటీర్ల అధ్యక్షుడు మరియు పీసా ఉపాధ్యక్షులు గెమ్మెలి కోటి బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి వాలంటీర్ల జీవనోపాధిపై ప్రభుత్వానికి నిలదీయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు వాలంటీర్ల కార్యదర్శి దేసగిరి మురళీమోహన్,వానింటి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పాఠశాల విద్యార్థి దశలోనే వ్యక్తిగత పరిశుభ్రత పట్ల పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి సిఆర్ఎం (సెంట్రల్ రివ్యూ మిషన్) బృందానికి తెలిపారు. అలాగే జిల్లాలో మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును, వాటి ప్రగతిని పరిశీలించి సమీక్షించేందుకు సీఆర్ఎం బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. ఈ పర్యటనలో రాష్ట్ర, జిల్లా స్థాయి ఆరోగ్య బృందాలతో పాటు సమన్వయ శాఖాధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యక్తిగత పరిశుభ్రత లోపం కారణంగా ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీనికి విద్యార్థి దశలోనే వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవసరమని గ్రహించి జిల్లాలోని ప్రతి అంగన్వాడీ, పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులకు ముస్తాబు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. తద్వారా ప్రతీ తరగతి గదికి ఇద్దరు లీడర్లను ఏర్పాటు చేసుకొని ప్రతి విద్యార్థి పరిశుభ్రంగా ఉన్నారా, లేదా అని పరిశీలించి తరగతి గదిలోకి పంపడం జరుగుతుందని, అలాగే మధ్యాహ్న భోజన సమయంలో భోజనం ముందు, తదుపరి, మరుగుదొడ్లు వినియోగించిన తరువాత చేతులు పరిశుభ్రం చేసుకున్నదీ, లేనిదీ పరిశీలిస్తారని చెప్పారు. దీనివలన ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతకు అలవాటు పడతారని, అదేవిధంగా వారి ఇంటి వద్ద కూడా తల్లితండ్రులకు అలవాటుగా మారుతుందని కలెక్టర్ వివరించారు. అలాగే జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉన్నందున పరిసరాల పరిశుభ్రత లోపం కారణంగా మలేరియా జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశముందని గుర్తించడం జరిగిందన్నారు. దీనికోసం మలేరియా కేసు నమోదైన గ్రామంలో మా ఊరికి మలేరియా వచ్చింది అనే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. తద్వారా ఆ గ్రామంలో మా ఊరికి మలేరియా వచ్చిందని, అందరూ జాగ్రత్తలు పాటించాలని దండోరా వేయించి ఇంటింటికి వెళ్లి మలేరియా నివారణ చర్యలను తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. తద్వారా జిల్లాలో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని వివరించారు. వీటితో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతీ శుక్రవారం జిల్లాలో పక్కాగా అమలుచేస్తున్నట్లు కలెక్టర్ బృందానికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా దోమలను పూర్తిగా నివారించేందుకు చేపట్టవలసిన అంశాలతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

కొమరాడ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య సంరక్షణ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించినట్లు సీఆర్ఎం బృందం కలెక్టరుకు వివరించారు. ఈ సందర్శన ద్వారా ఆయా కేంద్రాల పనితీరును, సేవలను అందించే విధానాన్ని పర్యవేక్షించినట్లు చెప్పారు. ముఖ్యంగా సామూహిక ముఖాముఖితో

పాటు స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆరోగ్య సేవలు, జాతీయ కార్యక్రమాల లబ్ధి గురించి అభిప్రాయాలను సేకరించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు చెప్పారు. మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి తగిన సూచనలు, సలహాలు అందించినట్లు చెప్పారు. సిఆర్ఎం బృందం పర్యటన జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి, ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులతో కూడిన రాష్ట్ర స్థాయి బృందం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డా. జి. నాగభూషణ రావు, ఐసిడిఎస్ పథక సంచాలకులు టి. కనకదుర్గ, రెడ్ క్రాస్ సంస్థ, స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువజన ఉత్సవాల్లో రాణించిన గురుకుల పాఠశాల విద్యార్థినులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్ వారి ఆధ్వర్యంలో పార్వతీపురం జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలలో మన్యం జిల్లాలోని గరుగుబిల్లి మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థునులు 7 అంశాలకు గాను జానపద నృత్యం జానపద గీతాలు, కవిత్వం, స్టోరీ రైటింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ పలు ప్రదర్శనలలో పాల్గొనగా అందులో నాలుగు అంశాలకు చెందిన జానపద గీతాలు, కవిత్వం, స్టోరీ రైటింగ్, జానపద నృత్యాలకు బహుమతులు గెలుచుకున్నారని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.రజని కుమారి తెలియజేసారు. ఈ బహుమతులను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్.యన్.ప్రభాకర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్న గరుగుబిల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులను జిల్లా అధికారులతో పాటు ఉమ్మడి జిల్లాల జిల్లా సమన్వయకర్త యం.మాణిక్యమమ్మ,గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రజనీకుమారి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మమ్మతో పాటు కళాశాల బోధనా సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : బాల్యవివాహాలపై నిఘాఉంచి నియంత్రించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు, ఎస్వీప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. పార్వతీపురం లయన్స్ క్లబ్,అప్ హెూల్డ్ సంస్థ, ప్రజాసంకల్పవేదిక మరియు జిల్లాయంత్రాంగంకలిసి సంయుక్తముగా బుధవారం ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మానవఅక్రమ రవాణా నిరోధక చట్టంబి1956 పై, బాల్య వివాహాల నిషేధ చట్టం బి2006పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉన్నవారు పోలీస్ హెల్ప్ లైన్ 112, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా స్థానిక పోలీస్ స్టేషన్లకు నివేదించాలని కోరారు. అంగన్వాడి ఆశా కార్యకర్తలు, గ్రామప్రెసిడెంట్లు, పోలీసులు అత్యంత జాగ్రత్తతో ఉండాలని తెలిపారు కళాశాలలో,పాఠశాలల్లో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు 2024 తీర్పు ప్రకారం బాల్యవివాహాల నిర్మూలనకు జిల్లాలు అప్రమత్తంగా ఉండాలి. 2030 నాటికి బాల్యవివాహాలను పూర్తిగా అంతం చేయాలనే జాతీయ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నామని అప్ ఓల్డ్ ఎన్జీవో డైరెక్టర్ ఫిలిప్తి తిమోతి అన్నారు. అప్ ఓల్డ్ ఎన్జీవో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామిగా ముక్తభారత్ ప్రచారంతో బాల్యవివాహాలు లేకుండా పర్యవేక్షణ చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి వెంకటనాయుడు, సభ్యులు, కళాశాల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి రహదారిని తారు రహదారిగా మంజూరు చేయండి

ఐదు కిలోమీటర్ల రహదారికి శ్రమ దానంతో పనులు చేస్తున్న ఆదివాసి గిరిజనులు

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని తమ్మంగుల పంచాయతీ వెదురుపల్లి, చిట్టెం గరువు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి ఆయా గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని మారుమూల పంచాయతీ అయిన తమ్మంగుల పంచాయతీ కి చెందిన వెదురుపల్లి, చిట్టం గరువు గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ గ్రామాలకు ఐదు కిలోమీటర్ల తారు రోడ్డు మంజూరు చేయాలని అన్నారు. ప్రస్తుతం మట్టి రహదారి కావడంతో వర్షాల సమయంలో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం తరపున ప్రధానమంత్రి జన్మన్ గృహాలు మంజూరు అయినప్పటికీ గృహాలు నిర్మించుకోవడానికి అవసరమైన ముడిసరుకు గ్రామాలలోకి తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందని ఆ గ్రామంలో ఉన్న గృహాలు మంజూరైన లబ్ధిదారులు వాపోతున్నారన్నారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు పొందలేక చాలామంది మృత్యువాత పడిన సంఘటనలు లేకపోలేదు అన్నారు. 2021లో ఒక గర్భిణీ గేమ్మెల దివ్య ప్రసవ వేదనతో సకాలంలో వైద్యం అందించడానికి అంబులెన్స్ కు ఫోన్ చేసినప్పటికీ అంబులెన్స్ రాక వైద్య మందక మృతి చెందిందని ఆ రహదారిని ప్రభుత్వ అధికారులు లేదా రాజకీయ నాయకులు చొరవ తీసుకొని ఐదు కిలోమీటర్ల తారు రోడ్డు మంజూరు చేయాలని ఈ సందర్భంగా

ఆయన డిమాండ్ చేశారు. గ్రామ పెద్ద గేమ్మెల దావీదు మాట్లాడుతూ మా గ్రామానికి సరైన రోడ్డు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. మేము ఎన్నిసార్లు అధికారులకు, రాజకీయ నాయకులకు విన్నవించుకున్నా, మా సమస్య పరిష్కారం కాలేదనే ఉద్దేశంతో శ్రమధానం తో రెండు గ్రామాల ప్రజలు మాట్లాడి తీర్మానం చేసుకొని గుంతలు పడ్డ రహదారి మట్టి వేసుకోవడం ద్వారా తాత్కాలిక పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. అవసరమైతే ఓట్లు వేయకుండా బహిష్కరిస్తామన్నారు. ఇప్పటికైనా మా గ్రామానికి తారు రోడ్డు మంజూరు చేసి రహదారి పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు గెమ్మెల సురేష్ కుమార్, సత్తిబాబు, నాగేష్, చిట్టిబాబు సహా అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాంపింగ్ టెంట్ల నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి : సీఐ

విశాలాంధ్ర-అరకులోయ : ప్రముఖ పర్యాటక కేంద్రం అందాల అరకులోయ పరిసర ప్రాంతాలలో వచ్చే 3 నెలల పర్యాటక సీజన్ సందర్భంగా క్యాంపింగ్ టెంట్లు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు ప్రభుత్వ అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమాగిరి ఒక ప్రకటనలో తెలిపారు.అరకులోయ పర్యాటక ప్రాంతంలో క్యాంపింగ్ టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్న నిర్వాహక యాజమాన్యం తాము ఎక్కడ క్యాంపింగ్ టెంట్లు ఏర్పాటు చేస్తున్నామో తెలియజేస్తూ సంబంధిత కార్యాలయానికి దరఖాస్తు సమర్పించి అనుమతులు పొందాలని ఆయన ప్రకటనలో తెలియజేశారు.అంతేకాకుండా దరఖాస్తు సమర్పణకు ముందుగా పోలీస్ శాఖ,రెవెన్యూ డిపార్ట్మెంట్,అగ్నిమాపకశాఖ, విద్యుత్ డిపార్ట్మెంట్,ఎన్ఓసి తీసుకోవాలని ఆయన ప్రకటనలో తెలిపారు.ఈ నిబంధనలతో పాటు పాడేరు ఐటిడిఏ క్యాంపింగ్ ఏర్పాటు కోసం నిర్దేశించిన రుసుమును కూడా తప్పనిసరిగా చెల్లించవలసి ఉంటుందని సీఐ హిమగిరి స్పష్టం చేశారు.ప్రభుత్వ అనుమతులతో క్యాంపింగ్ టెంట్లు ఏర్పాటు చేసే నిర్వాహకులు టెంట్లు ప్రదేశంలో పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని,త్రాగునీటి సదుపాయం,టాయిలెట్ సౌకర్యం కల్పించాలని ఆయన తెలియజేశారు.అలాగే అతిధి గృహాలు,రిసార్ట్స్ లు,లాడ్జిలు మాదిరిగానే పర్యాటకుల కోసం ప్రత్యేక రిజిస్టర్ బుక్ పెట్టాలని ఆయన సూచించారు.క్యాంపింగ్ టెంట్లలో బస చేసే పర్యాటకల వద్ద నుండి తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్సులుతీసుకోవాలని ఆయా చిరునామాలు రిజిస్టర్లో నమోదు చేయాలన సీఐ ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా,నిర్దేశిత రుసుము చెల్లించకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ కొనసాగించే క్యాంపింగ్ టెంట్లను తొలగిస్తామని ప్రకటనలో ఆయన హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : రాష్ట్రంలో పురపాలక సంఘాలు, కార్పొరేషన్ లో ఉన్న కార్మిక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయాలని, లేకుంటే నవంబరు 15 ,16 ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభల అనంతరం పోరాటానికి కార్మిక వర్గం సిద్ధం చేస్తామని, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మన్యం జిల్లా అధ్యక్షులు సిహెచ్ సింహాచలం సిఐటియు జిల్లా కోశాధికారి జి వెంకటరమణ తెలిపారు.బుధవారం పట్టణంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సూపర్ సిక్స్ అమలుచేస్తే కార్మిక సమస్యలన్నీ పరిష్కారం అయిపోయినట్టు కాదనిప్రభుత్వానికి గుర్తు చేశారు. రాష్ట్రంలో లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గం 12వ పిఆర్సి కమిటీ కోసం ఎదురుచూస్తోందని, ప్రభుత్వం అది ఇవ్వనప్పుడు ఐర్ ప్రకటించి కార్మికుల వేతనాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పురపాలక సంఘాల్లో, దాదాపు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్మిక వర్గానికి ఇవ్వడం లేదని, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పథకాలన్నీ కార్మికులకు అందిస్తామని నమ్మపలికిందని గుర్తు చేశారు .రాష్ట్రంలో గడిచిన అసెంబ్లీ సమావేశాలలో మాజీ శాసనసభ్యులకు పెన్షన్ పెంచుకొని, కార్మిక వర్గానికి మాత్రం మొండి చేయి చూపించారని తెలిపారు. మరో ప్రక్క నెల్లూరు, ఏలూరులో పని ప్రైవేటీకరణ చేసే విధానాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ గారు తీసుకువస్తున్నారని,గతంలో 279 జీవో అమలు చేసినప్పుడు వచ్చే సమస్యలే మరల అమలు చేయాలని చూస్తే కార్మిక వర్గం కోపాన్ని ప్రభుత్వం చూడాల్సి వస్తుందని తెలిపారు.పురపాలక సంఘాల్లో మహిళా ఉద్యోగులకు నేటికీ ప్రసూతి సెలవు లేదని, డ్యూటీలకు హాజరవుతున్న పాయింట్లలో కనీసం ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకునేలా మంచినీరు, మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం కొట్టుమిట్టాడుతోందని, నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కార్మికులకు విధులు చెప్పే అధికారులు, ప్రభుత్వం, వారు పరిశుభ్రంగా ఉండడానికి సబ్బులు, నూనెలు, చెప్పులు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో మహాసభలలో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునే దానికి వెనుకడుగు వేయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పార్వతీపురం కమిటీ నాయకులు నిర్మల, వరదరాజు,రవి, తిరుపతి, మామిడి శివ, బంగారి రాజేష్, మల్లేశ్వరరావు, శంకరరావు కార్మికులు పాల్గొన్నారు.

శివాలయం మెట్ట చుట్టూ భక్తుల గిరిప్రదక్షిణ

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజవొమ్మంగి గ్రామంలో వెలసిన శ్రీ ఉమారామ లింగేశ్వ స్వామి వెలసిన శివాలయం కొండ చుట్టూ బుధవారం భక్తులు గిరి ప్రదక్షణ చేశారు,ఈ కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది,ఈ కార్యక్రమానికి రెండు రోజుల ముందే నుంచే సహ్నాలు ఏర్పాటు చేయడంతో, రాజవొమ్మంగి మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,గిరి ప్రదక్షణ పూర్తిచేసిన తరువాత గొల్లపూడి పెద్దిరాజు కార్తీక పౌర్ణమి జ్యోతి వెలిగించారు. పూజలలో పెద్దఎత్తున పాల్గొన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం తమ స్వగ్రామాలకు విచ్చేసి కార్తీక పౌర్ణమి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఎటపాక : కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఎటపాక మండలం లోని బుట్టాయి గూడెం, గన్నవరం శివాలయం లో కపిలతీర్థంలో పెద్దసంఖ్యలో పిండి, నేతి దీపాలు వెలిగించిన మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలి కార్తికేయ స్వామి దేవాలయంలో పౌర్ణమి కార్తీక దీపారాధన కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. భక్తులు పుట్టలో పాలు పోసి దీపారాధన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో శివాలయం లు దర్శించుకున్నారు.

ఘనంగా కార్తీకపౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని అన్నిగ్రామాల్లో బుదవారంనాడు కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంక్రాంతిపండుగ తరహాలోనే కార్తీకమాసంలోవచ్చే కార్తీక పౌర్ణమిను ప్రతీఇంట్లో మహిళలు ఉపవాసంఉండిచేశారు. నోముపూజలు చేయడం,365వత్తుల కార్తీకదీపాన్ని వెలిగించడం, ప్రతీఇంట్లో వారిఇలవేల్పు దైవానికి మొక్కులు చెల్లించడం, కుటుంబ సభ్యులు అంతా కలిసికట్టుగా పూజలలో పాల్గొనడం కార్తీక పౌర్ణమి ప్రత్యేకతగా చెప్పవచ్చు.శివాలయాలను దర్శనం చేసుకోవడం, నదీస్నానాలు చేయడం, నదిలో దీపాలు విడిచిపెట్టి మొక్కులు చెల్లించుకుకోవడం, పూర్వీకులను స్మరించుకోవడం దీనిలో ప్రత్యేకతగా చెప్పవచ్చు. దీంతోపాటు అందరూ మహిళలుఒకదగ్గరఉండి కార్తీక పురాణం చదవడం కూడా జరుగుతుంది.ఏదేమైనా బుదవారం కార్తీక పౌర్ణమితో ఆలయాలతోపాటు గ్రామాల్లోని ఇళ్లల్లో మహిళలు

కార్తీక పౌర్ణమికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : సెప్టెంబర్ 5(గోదావరి విలేఖరి) అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని వడ్డిగూడెం నందు వెలసియున్న శ్రీసతి రుద్ర కోటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు తెల్లవారుజామునే గోదావరి స్నానములు ఆచరించి శ్రీసతి రుద్ర కోటేశ్వర స్వామికి పురోహితులు దీప దూప నైవేద్యాలతో పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల చుట్టూ ప్రక్కల నుండి వచ్చిన భక్తులకు ఎటువంటి అవాంఛనీయాలు తలెత్తకుండా ఆలయ కమిటీ, ఆలయ కమిటీ చైర్మన్ బొర్రా ఆదినారాయణ, టిడిపి మండల అధ్యక్షులు బొర్ర నరేష్ తగు ఏర్పాట్లు చేసామని తెలియజేశారు.

ఎల్విన్ పేట సెంటర్లో గిరిజనులు రెండవ రోజు నిరాహార దీక్ష

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజన హక్కులన్నీ పగడ్బందీగా అమలు చేయాలని ఆదివాసి భారత్ మహాసభ (ఏ బీ ఎమ్) జిల్లా కన్వీనర్ బిడ్డకి రమణ మూర్తి డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా బిడ్డకి రమణ మూర్తి మాట్లాడుతూ ఎల్విన్‌పేట సెంటర్లో ఆదివాసీ భారత మహాసభ (ఏ బీ ఎమ్) ఆధ్వర్యంలో గిరిజనులతో నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందని గిరిజన చట్టాలు పగడ్బందీగా అమలు అయ్యేంతవరకు, షెడ్యూల్ ప్రాంతంలో నాన్ ట్రైబల్స్ చేస్తున్న అరాచకాలను అరికట్టేంతవరకు కూడా ఆదివాసి భారత్ మహాసభ తరపున ఉద్యమిస్తామని అన్నారు, ఈరోజు నిరాహార దీక్షతో ప్రారంభించిన ఈ ఉద్యమం రానున్న రోజుల్లో గిరిజన ప్రజానీకమును చైతన్యపరిచి ఈ ఉద్యమంలో పాలుపంచుకునే విధంగా ప్రయత్నిస్తామని అన్నారు, హక్కులు సాధించుకునే విధంగా సంఘం తరపున ప్రయత్నం చేస్తామని అన్నారు,షెడ్యూల్లో ప్రాంతంలో గిరిజన హక్కులకు భంగం కలిగించే విధానాలపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, గుమ్మలక్ష్మీపురం మండలం షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం అమల్లో ఉన్నప్పటికీ, గిరిజన భూములు గిరిజనులకే చెందాలని నిబంధనలు ఉన్నప్పటికీ, కొంతమంది నాన్ ట్రైబల్స్ నిబంధనలను అధిగమించి అక్రమంగా పక్కా ఇల్లులు నిర్మించడం, గిరిజన యువతకే ఉపాధి కల్పించే దుకాణాల సముదాయ స్థానములో అక్రమంగా పట్టాలు సృష్టించి షాపులు నిర్మించుకొని వ్యాపారాలు చేస్తుండటం చూస్తుంటే గిరిజన హక్కులను కాలరాయిడమేనని అన్నారు. నిరాహార దీక్షకు మద్దతుగా సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న మద్దతు తెలుపుతూ మాట్లాడడం జరిగింది, కేంద్రంలో ఉన్న బిజెపి, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు కూడబలుక్కొని గిరిజన హక్కులను కాల రాస్తున్నారని అన్నారు, గుమ్మలక్ష్మీపురం మండలం షెడ్యూల్డ్ ప్రాంతం అయినప్పటికీ అమాయక గిరిజనుల పైన నాన్ ట్రైబల్స్ కొంతమంది పెద్దరికం చేస్తూ వాళ్లకున్న హక్కుల పైన, వాళ్లకున్న భూములు పైన పెత్తనం చేస్తూ దోపిడి చేస్తున్నారని అన్నారు, షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజన భూములు గిరిజనులకే చెందాలని చట్టం చెపుతున్నప్పటికీ షెడ్యూల్డ్ ప్రాంతంలో నాన్ ట్రైబల్స్ కి స్థలాలపై పట్టాలు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు, దీనిపైన పార్టీ తరపున హైకోర్టుకు వెళతామని అన్నారు, గిరిజన ప్రాంతంలో ఒకనాడు గిరిజన ఉద్యమం జరిగిందని ఆ ఉద్యమం ఫలితంగానే అనేక చట్టాలు సాధించుకున్నారని తద్వారా ఐ టీ డి ఏ, జీసీసీలు, సంక్షేమ హాస్టల్లు, చదువుకున్న గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు పోరాట ఫలితమేనని అన్నారు అనేకమంది పోరాటం చేసి సాధించిన ఫలితాలు నేడు అన్యాయంగా కాలు రాస్తున్నారని అన్నారు, గిరిజన యువత ఈ విషయాలన్నీ తెలుసుకొని ఉన్న హక్కులన్నీ కాపాడుకోవడానికి నడుం బిగించి ముందుకు రావాల్సిందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, బిడ్డక రమణ మూర్తి , పత్తిక మోహన్ రావు పాల్గొన్నారు.

నూతన కమిటీలు ఎంపిక, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

విశాలాంధ్ర-జీకే వీధి : వైఎస్ఆర్సిపి అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి వర్యులు, వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు, అల్లూరి సీతారామరాజు జిల్లా వైసీపీ అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచనలు మేరకు, జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో, స్థానిక సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి అధ్యక్షతన బుధవారం ఉదయం గంటలకు రింతాడ పంచాయితీ లోనూతన పంచాయితీ కమిటీలు ఎన్నిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది.రింతాడ పంచాయితి పార్టీ అధ్యక్షులుగా సోబోయి రామమూర్తి, మహిళా విభాగం పంచాయితీ అధ్యక్షురాలుగా కిలో ఈశ్వరమ్మ, రైతు విభాగం పంచాయతీ అధ్యక్షులుగా దేశగిరి వీరన్న పడాలు, యూత్ విభాగం పంచాయతీ అధ్యక్షులుగా కొయ్యం రాంబాబు, వాలంటీర్ విభాగం అధ్యక్షుడు గెమ్మెల కోటిబాబు, క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు పలసి చిన్నారావులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకోవస్తే పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వారి దృష్టిలో ఉంచి పరిష్కారం చేయిస్తామని కార్యకర్తలకు భరోసా ఇవ్వటం జరిగిందినీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి షేక్ మజీద్, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షులు లంబసింగి రమేశ్ ,జీకేవీధి మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్,జీకే వీది మండల ప్రధాన కార్యదర్శులు వంతల చంటి బాబు, మండల యువత అధ్యక్షులు కొర్ర బాబి,మండల సోషల్ మీడియా మండల అధ్యక్షులు పాతూను లక్ష్మణ్,మండల ఎస్టి సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణరావు, రింతాడ పంచాయితీ పరిధిలో గల ఈదుల బంద, రింతాడ, అసరడ, కడుగుల, ఏబులం, పనస లొద్ది, కాకర పాడు, కోరపల్లి, గ్రామాలు నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం పోలీస్ బందోబస్తు : సీఐ

విశాలాంధ్ర-కొయ్యూరు : కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కొయ్యూరు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విశేషమైన కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండలంలో గల ప్రముఖ శైవక్షేత్రాల వద్ద భక్తులు పోటెత్తే అవకాశం ఉండడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం, వలసంపేట గాదిగుమ్మి సమీప శ్రీ గిరిజ తాండవేశ్వర స్వామి ఆలయాలను కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఎస్ఐ కిషోర్ వర్మ సందర్శించారు. ఆయా ప్రాంతాలకు వచ్చే భక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయాల వద్ద భద్రతా చర్యలు పాటించాలని అర్చకులు, ఆలయ కమిటి సభ్యులతో చర్చించి తగు సూచన చేసారు. భక్తుల రద్దీ దృష్ట్యా తొక్కిసలాట, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్తీక మాసంలో వన భోజనాలకు వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలి

పార్వతీపురం రూరల్ సిఐ రంగనాథం

విశాలాంధ్ర-కొమరాడ : కార్తీక మాసం చుట్టుపక్కల ఉన్న వచ్చే దేవాలయాల ప్రజలకు కార్తీక్ మాసం పౌర్ణమి అనంతరం చుట్టుపక్క ప్రజలు కలిసి వన భోజనాలకు వచ్చినప్పుడు జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఎంతో ఉందని, అలాగే కొమరాడ మండలంలోని కావలి నది తీర ప్రాంతంలో ప్రజలకు కార్తీక మాసం సందర్భంగా నాగవల్లి నది ప్రవాహం ఎక్కువ ఉండబట్టే చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజలు నీటిలో దిగినప్పుడు ప్రజలు జాగ్రత్తగా పాటించవలసిందిగా పార్వతీపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.రంగనాథ్ అన్నారు. గురువారం కొమరాడ పోలీస్ స్టేషన్ వద్ద పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు వారు ఒక విన్నపం ప్రజలందరూ వచ్చిన దేవాలయాలకు వనభోజనాలకు వాళ్లతో పాటు పిల్లలు కూడా వృద్ధుల్లో కూడా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉందని ఏఒక్కరు కూడా తొందరపడకుండా నదిలో వద్ద వెళ్లకూడదని కార్తీక మాసంలో వనభోజనాల సందర్భంగా వనభోజనాలు చేసినప్పుడు చుట్టుపక్క జాగర్తలు పాటించాలని మండలంలో నదీ పరవాక ప్రాంతాల్లో వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉంటూ వనభోజన కార్యక్రమాలు నిర్వహించు కోవాలని సూచించారు. వనభోజనాల సమయంలో మద్యం సేవించి యువత ప్రజలకు భక్తులకు ఇబ్బందులు కలగ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమరాడ ఎస్ ఐ కే నీలకంఠం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే

పాఠశాలల్లో విద్యార్థుల యోగక్షేమాలపై యాజమాన్యం జాగ్రత్త వహించాలంటూ ఆదేశాలు

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పలు పత్రికల్లో వచ్చిన వార్తలతో రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీష దేవి స్పందించారు. బుధవారం ఆమె ఆకస్మికంగా ఆ పాఠశాలను సందర్శించి, విద్యార్థుల యోగక్షేమాలను, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల యోగక్షేమాలపై ఏ అశ్రద్ధనూ సహించేది లేదని హాస్టళ్లలో, తరగతిగదుల్లో విద్యార్థుల పట్ల పూర్తి బాధ్యత యాజమాన్యం వహించాలి. ఏ విద్యార్థికైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవు అని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం అదృశ్యమైన 8వ తరగతి విద్యార్థిని కుటుంబ సభ్యుల ఇంట్లో ఉన్నట్లు తెలిసి, తిరిగి పాఠశాలకు తీసుకొచ్చినట్లు యాజమాన్యం వివరించింది. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థినిని స్వయంగా కలసి మాట్లాడారు. మంచిగా చదువు, ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా చెప్పు నేను పరిష్కారం చూపిస్తాను అని ఆమె ప్రోత్సహించారు. తరువాత పాఠశాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులతో ఎలా వ్యవహరించాలో సూచనలు ఇచ్చారు. విద్యార్థుల మానసిక పరిస్థితులను గుర్తించి ప్రేమతో వ్యవహరించి ఎలాంటి ఒత్తిడులు లేకుండా చదువుకునే వాతావరణం కల్పించలని అని సూచించారు. అదే విధంగా వంటశాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆహార నాణ్యత, మెనూ పట్టికను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొనసాగాలని ఆదేశించారు. విద్యార్థులతో భోజన నాణ్యతపై మాట్లాడుతూ వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆహారం సరిగ్గా అందుతోందా ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా అని ఆమె ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రతను మెరుగుపరచాలని, ప్రతి విద్యార్థిపై తరగతి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరం మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలి అని ఆమె ప్రోత్సహించారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు బిసెట్టి అప్పాజీ, పుత్సల గురునాథరెడ్డి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు మళ్ళా దుర్గాప్రసాద్, అరకు టీ.ఎన్.ఎస్.ఎఫ్. సభ్యులు దూడ ప్రణీత్, తెలుగు యువత అధ్యక్షులు మళ్ళా బాలరామ్, ఉపసర్పంచ్ పల్లాల భూపతి రెడ్డి, సీనియర్ నాయకులు ఎరుబండి రాంబాబు, ఎస్.కె మస్తాన్, జనసేన యూత్ అధ్యక్షులు బి. సత్య, బి.శివరాజు, ఐటిడిపి మండల కన్వీనర్ పాము రాంబాబు, ఎంపీడీఓ కిషోర్, ఏటిడబ్ల్యుఓ జి. తులసీదాస్, ప్రధానోపాధ్యాయులు జ్యోతి లక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శక్తి టీంలు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం, శక్తి టీమ్స్ నోడల్ ఆఫీసర్ అంకిత సురాన ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్స్, పోలీస్ అధికారులు, సిబ్బంది బుధవారం పార్వతీపురం మండలం నందు వున్నటువంటి గవర్నమెంట్ హైస్కూలు, దత్తుపేటలోని ఎలిమెంటరీ మునిసిపల్ స్కూల్, ఆదిత్య ప్రైవేట్ స్కూల్, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఈగిల్ మరియు బాల్య వివాహాలు, డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి శక్తి టీం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందని తెలియచేస్తూ ప్రతి ఒక్క విద్యార్థిని తన యొక్క మొబైల్ ఫోన్లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అందులో ఉండే 11 ఫ్యూచర్స్ పై అవగాహన చేసుకుని ఆపద సమయంలో శక్తి యాప్ ఎలా వినియోగించుకోవాలో వారికి అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పార్వతీపురం శక్తి టీం 1 ఇంచార్జ్ మరియు ఎఎస్ఐ లెంక శ్రీనివాసరావు (1154), హెడ్ కానిస్టేబుల్ యు. గురుమూర్తి, మహిళా కానిస్టేబుల్ నిర్మల, శక్తి టీం పాల్గొన్నారు.

జిల్లాలో వైద్య సేవలు, పథకాలందుతున్న తీరుపై కేంద్ర వైద్య బృంద సభ్యులు పరిశీలన

విశాలాంధ్ర-బెలగాం/కురుపాం : గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరుపై కేంద్ర వైద్య బృంద సభ్యులు(సిఆర్ఎమ్ టీమ్) జిల్లాలో పర్యటన చేసి పరిశీలించారు. కామన్ రివ్యూ మిషన్‌లో బాగంగా డా. భవానీ సింగ్, అంకుర్ శర్మలతో కూడిన బృంద సభ్యులు బుధవారం బత్తిలి, కురుపాం ప్రభుత్వ ఆసుపత్రుల్లో తనిఖీలు చేపట్టారు. తొలుత జిల్లా కలెక్టర్ తో కలెక్టరేట్ లో సమావేశమై జిల్లాలో ఆరోగ్య పరిస్థితులు, వైద్య సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు పరిశీలనలో భాగంగా ఆరోగ్య కార్యక్రమాలు ద్వారా ప్రజలకు ఏ రీతిన వైద్య సేవలు అందిస్తున్నారు, ప్రభుత్వ పథకాలు ఏ మేరకు చేరువవుతున్నాయో రాష్ట్ర బృంద సభ్యులతో కలిసి పరిశీలన చేశారు. వైద్య అదికారులు, వైద్య సిబ్బందితో సమీక్షించి ఆరోగ్య కార్యక్రమాలపై ఉన్న పరిజ్ఞానాన్ని, పని తీరు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రి వివిధ విభాగాలను, ఆవరణ పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరు పరిశీలించారు. ఐఈసి గోడ పత్రికల ప్రదర్శన తిలకించారు. టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ అందజేశారు. గ్రామీణ ప్రజలతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. బత్తిలి జెడ్.పి హైస్కూల్ సందర్శించి విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ పై పరిశీలించారు. జిల్లాలో అధిక భాగం గిరిజన, గ్రామీణ ప్రాంతాలతో కూడిన, భౌగోళిక పరిస్థితులతో కొంతవరకు అవాంతరాలు చోటుచేసుకున్నపటికీ వైద్య సేవలు అందిస్తున్న తీరుపై బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో చేపట్టిన పరిశీలనల నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిబి స్టేట్ కన్సల్టెంట్ ప్రశాంత్, సూపరింటెండెంట్ డా. సందీప్, వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులు డా. ఎం. వినోద్ కుమార్, డా. కౌశిక్, వైద్యాధికారులు డా. రవీంద్ర, డా. దామోదర్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని రేఖపల్లి అటవీ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అటవీ క్షేత్ర అధికారి ఎస్.రామకృష్ణ, డిఆర్ఓ పి.ధర్మయ్య బీట్ ఆఫీసర్ ఎస్ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 3000 తానే, కానుగ చింతమొక్కలను (తేమరెండర్ స్ ఇండికా) పంపిణీ చేయడం జరిగింది., ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలలకు కళాశాలకు ఈ సంవత్సరంలో రెండవసారి మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని, పకృతిని సస్యశ్యామలం చేయడం కొరకు మొక్కలు ప్రతి ఒక్కరి చేత నాటించమని పర్యావరణం పరిరక్షణ మనందరి బాధ్యతనీ తెలియజేశారు ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ సాయి రమణ, సీనియర్ అసిస్టెంట్ యం చిన్న బాబు, కళాశాల సిబ్బంది, అడవి శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హెూం టూరిజం విజయవంతం చేయాలి

35 శాతం రాయితీతో 40 వేల హెూం స్టేల ఏర్పాటుకు ప్రణాళిక

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: జిల్లాలో హెూం పర్యాటకాన్ని విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఐటీడీఏ పాడేరు సమావేశ మందిరంలో హెూం స్టే నిర్వాహకులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మినిస్టర్ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ మరియు పీఎం జుగా పథకం కింద జిల్లాలో ఇప్పటికే 150 గృహాలకు హెూం స్టే ఏర్పాటుకు అనుమతులు లభించాయని కలెక్టర్ తెలిపారు. నలభై లక్షల గడప ఉన్న జిల్లాలో 40 వేల హెూం స్టేలు ఏర్పాటు చేసే విధంగా జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోందని వెల్లడించారు. అరకు రీజియన్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించి, ఈ ప్రాంత ప్రజలకు జీవనోపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి ఒక పాలసీ రూపంలో తీసుకురావడం గొప్ప విషయమని, ఈ అవకాశాన్ని పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెూం స్టేల ఏర్పాటులో ఎదురయ్యే ఆర్థిక సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రాయితీతో కూడిన రుణాలు ఇప్పించడం జరుగుతుంది. హెూం స్టేను ఎంఎస్ఎంఈ పరిశ్రమగా పరిగణించి, ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీమ్ కింద పరిశ్రమల శాఖ ద్వారా 35 శాతం రాయితీ లభిస్తుంది. ప్రభుత్వ అనుమతి ఉన్న హెూం స్టేలకు పెట్టుబడిలో 5 శాతం రాయితీ లభిస్తుందన్నారు. హెూం స్టేలపై పెట్టిన పెట్టుబడి రెండు సీజన్లలోనే తిరిగి వస్తుందని, నిర్వాహకులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. నిర్వాహకులలో నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడానికి ఒక నైపుణ్యం గల బృందం ద్వారా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించే విధంగా సౌకర్యాలను బట్టి హెూం స్టేలను సిల్వర్ మరియు గోల్డ్ కేటగిరీలుగా విభజించారు. పర్యాటకుల భద్రత విషయంలో నిర్వాహకులు రాజీ పడాల్సిన అవసరం లేదని, ప్రతి గ్రామ, మండల, జిల్లా పరిధిలో భద్రతా కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పది, పదిహేను హెూం స్టేలు ఒక దగ్గర ఉంటే డీఆర్‌డీఏల ద్వారా హెూం స్టే సంఘాలను ఏర్పాటు చేసి బలోపేతం చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ, హెూం స్టేల ద్వారా ఈ ప్రాంత గిరిజన ప్రజల ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు, ఆహార పద్ధతులు పర్యాటకులకు తెలుస్తాయని, తద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన ఆర్థిక పరిస్థితులు లభిస్తాయని చెప్పారు.

గిరి రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏజీఎం సూచన

విశాలాంధ్ర-చింతపల్లి : గిరి రైతులు పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా ఎఫ్‌పీఓలు కృషి చేయాలని జిల్లా ఏజీఎం సూచించారు. బుధవారం ఆయన చింతపల్లిలోని "మా తోట" ఎఫ్‌పీఓ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాఫీ పండ్ల ప్రాసెసింగ్ యూనిట్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. 2025-26 ఏడాదికి గాను కాఫీ పండ్లను పార్చిమెంట్ రూపంలో తయారు చేయడానికి మిషన్ ప్రారంభమైంది. అనంతరం ఆయన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌తో సమావేశమై మాట్లాడుతూ ఎఫ్‌పీఓలు కాఫీ పండ్ల సేకరణతో పాటు ఇతర వ్యవసాయ పంటల సేకరణపైనా దృష్టి సారించాలని సూచించారు. నాబార్డ్ ద్వారా ఎఫ్‌పీఓలకు అన్ని స్థాయిలలో సహాయం అందజేస్తున్నామని, రైతులకు మార్కెట్ పరిస్థితులపై అవగాహన కలిగించి తర్వాతే ధర నిర్ణయించాలన్నారు. ధరలు రైతులకు మేలు చేసే విధంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తదుపరి "మా తోట" ఎఫ్‌పీఓ సీఈఓ వనమల చిన్నారావు మరియు ప్రెసిడెంట్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా గిరి రైతులు పండించే కాఫీ పండ్లను కొనుగోలు చేయాలని బోర్డ్ తీర్మానించిందని తెలిపారు. ధరపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం కిలో కాఫీ పండ్లకు ?60 ధరగా నిర్ణయించామని తెలిపారు. అదనంగా, ఆర్గానిక్ సర్టిఫికేషన్ కలిగిన రైతులకు కిలోకు ?3 ప్రీమియం ధర చెల్లించాలనే నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. కాఫీ పండ్లను ఎఫ్‌పీఓ కేంద్రానికి తీసుకొచ్చి అప్పగించే రైతులకు రవాణా ఖర్చులు కూడా అదనంగా చెల్లించ నున్నట్లు తెలిపారు.

మండల తహసీల్దార్ బదిలీ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న వై. జయలక్ష్మి బదిలీ అయ్యారు. ఈమెను కలెక్టరేట్లో హెచ్ సెక్షన్ కు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు దీంతో బుధవారం ఆమె క లె క్ట రే ట్ క ు వెళ్ళిపోయారు. ఈ మండలానికి వచ్చిన ఆరు నెలల్లోనే బదిలీ చేయడం చర్చనీయాంసంగా మారింది. కాగా మండల తహసీల్దారుగా కలెక్టరేట్ హెచ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్ అప్పారావును నియమించారు అయితే ఈయన విధులలో చేరాల్సి ఉంది.

కృష్ణ కుటుంబాన్ని ఎస్టీ కమిషన్ సభ్యుడు సాయిరాం పరామర్శ

విశాలాంధ్ర-అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలంలోని చొంపి పంచాయతీ కొత్తవలస గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కారుకొండ కృష్ణ వర్ధంతికు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు కిల్లో సాయిరాం హాజరై కృష్ణ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించి సభ్యులను పరామర్శించారు. అంతేకాకుండా కృష్ణ కుటుంబానికి ధైర్యం చెప్పి ఏ కష్టసమాయములోనైనా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ అన్నివేళలా అండగా ఉంటూ కష్ట సమయాల్లో ఆదుకుంటూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కృష్ణ మృతి కుటుంబానికి తీరని లోటు అయినప్పటికీ ఆ బాధను దిగమింగుకొని ధైర్యంతో ముందుకు సాగాలని కుటుంబ సభ్యులకు కిల్లో సాయిరాం ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో చినలబుడు పంచాయతీ మాజీ సర్పంచ్ పూర్ణ, అసెంబ్లీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి క్లస్టర్ ఇంచార్జ్ దన్నాయికి రమేష్ మాడగడ పంచాయతీ వార్డు సభ్యుడు యూనిట్ ఇంచార్జ్ వంతల డేవిడ్, బస్కి పంచాయితీ బూత్ ఇంచార్జ్ సోనాలి రమేష్, ఎం.సునీల్, సిరిగం కొండలరావు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాల మత్తులో చిక్కుకొని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు : ఎస్ఐ వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-చింతపల్లి : మాదకద్రవ్యాల మత్తులో యువత చిక్కుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై వి.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, అల్లూరి జిల్లా వారి ఆధ్వర్యంలో బుధవారం చింతపల్లి వారపు సంతలో మాదక ద్రవ్యాల (గంజాయి) నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన, టీనేజ్ ప్రెగ్నెన్సీ, డ్రాప్ ఔట్స్‌పై కళా జాత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద కళాజాత రూపంలో గంజాయి, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ, డ్రాప్ ఔట్స్ గురించి పాటలు, ఆటలు రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువును అశ్రద్ధ చేయకుండా చదువుకోవాలని, విద్యార్థి దశలో గంజాయి వంటి చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా క్రమశిక్షణతో సన్మార్గంలో నడవాలని, బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల బాలికలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు సహాయం కొరకు చైల్డ్ హెల్ప్ లైన్ %బీశీ%.1098 ను ఉపయోగించి వారిని కాపాడుటకు కృషి చేయాలని వివరించారు. బాలల చట్టాల గురించి జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది డ్రాప్ అవుట్స్, టీనేజ్ ప్రెగ్నెన్సీ గురించి ఆట పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది శేఖర్, అశోక్, గనేశ్వరి, శాంతి. ఐసిడిఎస్ సూపర్వైజర్లు జయ భారతి, గౌరీ, వి ఎస్ ఆర్ రూరల్ మీడియా కళా జాత బృందం, అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం అమలుచేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : ప్రభుత్వ రంగ కార్మికులకు కనీస వేతనం.అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు మండలంలోని రేఖపల్లి గ్రామంలో సీఐటీయు 9వ మహాసభ సిఐటియు మండల అధ్యక్షులు కనకమహాలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సీనియర్ సభ్యులు సున్నం రంగమ్మ జెండా ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులకు రాయితీ బ్యాంకులు తీసుకున్న వారికి రుణాలు సహకరిస్తున్నాయినీ ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని 42 రోజులు దీక్ష చేస్తే దీక్ష వద్దకు వచ్చి మేము అధికారంలోకి రాగానే వేతనం పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట తప్పిందని ఏద్దవా చేశారు. స్కీం పర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా పనిచేస్తున్నా కనీసం వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏ, మిడ్డే మిల్స్, ఆశ, ఫీల్డ్ అసిస్టెంట్, అన్ని రంగాలు కార్మికులందరినీ ఐక్యం చేసి కనీస వేతనాలు సాధించే వరకూ పోరాడుతామని, పోరాటం చేస్తామని హెచ్చరించారు ఆల్ ఇండియా సిఐటియు మహాసభలు మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు ఉంటాయని మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కన్వీనర్ గా గొర్రె రాజు, కో కన్వీనర్ గా ముసురు రాజేశ్వరి, ఏకగ్రీవ ఎన్నిక ఎన్నుకున్నారు. మరో 27 మంది, నూతన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు. అంగన్వాడి, ఆశ, మిడ్ డే మిల్స్ శానిటైజర్, వీఆర్ఏ, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ కుయుక్తులను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్తాం

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ తలపెట్టిన కోటి సంతకాల సేకరణను పూర్తి చేసి గవర్నర్‌కు నివేదిస్తాం

- వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షుడు, పాడేరు శాసనసభ్యుడు విశ్వేశ్వరరాజు

విశాలాంధ్ర-చింతపల్లి : కార్పొరేట్ వ్యక్తులకు మాత్రమే అన్ని రకాల అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతుందని వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు, పాడేరు శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాంగి గణబాబు ఆధ్వర్యంలో బుధవారం వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, మండల నాయకులతో కలసి వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసిపి నిర్వహిస్తున్న కోటి సంతకాలు సేకరణ ప్రజా ఉద్యమ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కోటి సంతకాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వేశ్వర రాజు కోటి సంతకాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు మంచి చెయ్యడం కోసం ఒక మంచి లక్ష్యంతో వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి గా ఉన్న చంద్రబాబు నాయుడు వైద్య కళాశాలలో పేదవారికి అవకాశం లేకుండా కళాశాలలను ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్ వ్యక్తులకు మేలు చేసే ఆలోచన చేయడం దురదృష్టకరమన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, విజనరీ గల ముఖ్యమంత్రి అని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు వైద్య కళాశాలలో పేదవానికి చోటు లేకుండా కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతుందన్నారు. వైద్య కళాశాల ఉన్న ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ వ్యక్తులకు అవకాశాలు కల్పించే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ చేసి గవర్నర్ కు అందజేసే కార్యక్రమాన్ని వైసీపీ చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా నేడు చింతపల్లి గ్రామంలో మండలంలోని 17 పంచాయతీల ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానంపై ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి మద్దతు తెలిపి సంతకాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీ గోపీనాయిక శారద, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు దూరియ పుష్పలత, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి బూసరి క్రిష్ణరావు, ఏఎంసి మాజీ చైర్ పర్సన్ జల్లి హలియారాణి, స్థానిక ఎంపీటీసీలు దాసరి దారలక్ష్మి, చింతడ జయలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు వనగల బెన్నిబాబు, పి బెన్నా స్వామి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు లోచలి ప్రసాద్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు కొర్ర రఘునాథ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిందాడ అప్పారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సందక తాతారావు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు లకే సాగర్, ఎంపీటీసీలు బచ్చలి మచ్చమ్మ, కొర్ర సూరిబాబు, గెమ్మెల సోనీ, లువ్వాబు మీనా కుమారి, తాంబేలి మోహన్ రావు, జర్త రూతు, మఠం రాజులమ్మ, పొట్టిక లోవరాజు, వనుము పద్మ, రావుల నాగమణి, సర్పంచులు కొర్రా రమేష్‌నాయుడు, వైస్ సర్పంచ్ ఆగురు కోటేశ్వరరావు, సలిమితి లక్ష్మయ్య, గెమ్మెలి లలిత, పాంగి లక్ష్మి, సమిడి గోపాల్, కొర్ర శాంతి కుమారి, వంతల మహేశ్వరి, వనగల సోమరత్నం, వనుము రమణమ్మ, సీనియర్ నాయకులు సాగిన గంగన్న పడాల్, కవెర్ల రామారావు, మూత శ్రీను. కిట్లంగి కృష్ణ, వేములపూడి పరమేశ్వరరావు, సుంద్రు చిన్నబ్బాయి, కోరాబు కరుణానిధి, గెమ్మెల సింహాచలం, అరడ గంగన్న దొర, లోచల రాజారావు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం సంధ్యారాణి, రావుల నూకరాజు, బోండా సింహాచలం అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మహిళ డిగ్రీ కళాశాలలో ఘనంగా వన సమారాధన



విశాలాంధ్ర-అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు, డిపార్ట్మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ కార్తిక వన సమారాధనతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందని, ప్రజలకు ప్రకృతి మధ్య ఒక గొప్ప దృఢమైన సంబంధం ఉంటుందని ఆయన అన్నారు. వన సమారాధన అంటే కార్తీకమాసంలో ఉసిరి చెట్టు నీడలో బంధువులు స్నేహితులు కలిసి భోజనం చేయడం గొప్ప అనుభూతి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఓడి డిపార్ట్మెంట్ ఆఫ్ బోటనీ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ ప్రకృతిలో మానవ సంబంధాలతో మొక్కలకు ఉన్నటువంటి బాధ్యతలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్.శ్రావణి, ఎన్ఎస్ఎస్ పిఓలు కె.బాలరాజు, సుభాన్, డాక్టర్ లక్ష్మి, విద్యారాణి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మత్స్యలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఐటిడిఏ పీఓ తిరుమాణి శ్రీపూజ

విశాలాంధ్ర-హుకుంపేట : గిరిజన ప్రాంతాల ఆరాధ్య దైవమైన మత్స్యలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని పాడేరు ఐటిడిఏ ప్రోజెక్టు ఆధికారిణి తిరుమాణి శ్రీపూజ తెలిపారు. బుధవారం మండలంలోని మఠం పంచాయితి మత్స్య గుండం వద్ద సందర్శించి మత్స్యలింగేశ్వర స్వామి ఆలయం గడ్డ వద్ద వెలసిన మచ్చులు వద్ద కర్తీక పౌర్ణమి వేడుకలు పురస్కరించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు ప్రత్యేకంగా దుస్సాల్వా కప్పి బోకే అందించి మత్స్యలింగే శ్వర స్వామి చరిత్రబుక్ అందిం చారు. ఆలయ ప్రాంత పరిసరాలు పరిశీలించారు. అనం తరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాదిలోని మహాశి వరాత్రులు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆలయ అభివృద్ధి చూసి మరింత భక్తుల జనం వచ్చే విధంగా తిర్చిదిద్దాలని ఆమె ఆదేశించారు. కర్తీక మాసంలో భక్తు లు మరింత మంది తరలి వచ్చి ప్రత్యేకంగా దర్శించుకునే విధంగా సౌకర్యాలు కల్పించి నిత్య దర్శనాలు జరిగే విధంగా తీర్చిదిద్దాలని తమ సహకారం ఉంటుందని ఆమె భరోష ఇచ్చారు. ఇంత ప్రశాంత మైన ప్రదేశంలో భగవంతుడుని ప్రత్యేక పూజలు చేసుకోటం ఎంతో పుణ్యామని సంతోష%శీ% వ్యక్తం చేసారు. స్థానిక సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ సూర్య నారయణలు దర్శిం చుకోని వచ్చే భక్తులకు ఏటువంటి ఇబ్బంది కలగకుండా సిబ్బందితో భద్రత కలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక సర్పంచ్ శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం సమస్యలపై లోకేష్‌కు వినతి

విశాలాంధ్ర-కూనవరం : పోలవరం పరిహారం ప్యాకేజీ విషయాల్లో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటు నియోజకవర్గం ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ ఐటీ శాఖ మంత్రి లోకేష్‌ను కలిసి విన్నవించారు. ముంపు మండలాల్లో నిర్వాసితుల కాలనీలు ఇంకా పూర్తి కాలేదని, పరిహారం విషయంలో జాప్యం జరుగుతోందని, పేర్కొన్నారు. కాండూర్ లెక్కల ప్రకారం కాకుండా ముంపుకు గురయ్యే ప్రతి గ్రామానికి ప్యాకేజీ ఇవ్వాలని, 18 ఏళ్ల నిండిన యువతీ యువకులకు కట్ ఆఫ్ డేట్ పొడిగించి వారికి కూడా పరిహారం అందించాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందించారు.